ninadam.in

# నినాదం

తెలుగు దినపత్రిక

నిఖార్సైన జర్నలిజం

| ఆదివారం, మార్చి 22, 2026 | సంపుటి - 22 | సంచిక 174 | వెల - 7 | పేజీలు - 12 - 8 |
|---|---|---|---|---|

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam



## యుద్ధం విరమించాలని ఆలోచిస్తున్నాం

- ఇరాన్‌పై యుద్ధంలో తుది దశకు చేరుకున్నాం
- సైనిక చర్యలను తగ్గించే విషయం పరిశీలిస్తున్నాం
- ట్రూత్ సోషల్ మీడియాలో ట్రంప్ పోస్ట్
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షలు ఎత్తివేత

## ఇరాన్ యుద్ధం తీవ్రం

- దాడులను తీవ్రతరం చేసిన టెహ్రాన్
- హిందూ మహాసముద్రం పైకి బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగం
- డియేగో గార్సియా దీవిలోగల సైనిక స్థావరంపై మిసైల్స్..

వాషింగ్టన్, టెహ్రాన్ : ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. రోజురోజుకూ ఇరాన్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఈ క్రమంలోనే హిందూ మహాసముద్రం పైకి ఇరాన్ రెండు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. ఇలా ఇరాన్ తన దాడులను తీవ్రతరం చేసినట్టు తెలుస్తోంది.

### ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోడీ ఫోన్



**న్యూఢిల్లీ, నినాదం:** ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్‌కు ఈద్, నౌరూజ్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ కాలం పశ్చిమ ఆసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకువస్తుందనీ ఆశాభావం మోడీ వ్యక్తం చేశారు. ఇరాన్ నాయకుడితో జరిపిన ఫోన్ సంభాషణలో మోడీ ఇరాన్‌లో కీలక మౌలిక సదుపాయాలపై జరిగిన దాడులను ఖండించారు. ఈ దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులకు అంతరాయం కలిగిస్తాయని నొక్కి చెప్పారు. నౌకాయాన స్వేచ్ఛను పరిరక్షించడం, షిప్పింగ్ మార్గాలు తెరిచి సురక్షితంగా ఉండేలా చూడాలని దాని ప్రాముఖ్యతను మోడీ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ మేరకు మోడీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

2

## ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

### డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం
### రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలు: రాహుల్ గాంధీ

2





## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం ప్రారంభం

- భారీగా ఏర్పాట్లు చేసిన వ్యవసాయాధికారులు
- రైతుబంధు నిధులను కూడా విడుదల చేయనున్న సిఎం
- సిఎం రాకతో నర్మేట్టలో భారీగా బందోబస్తు..ఏర్పాట్లు

సిద్ధిపేట జిల్లాలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ ప్రారంభం తెలంగాణ వ్యవసాయ రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలవబోతోంది. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుకు కొత్త ఊపును ఇవ్వనుంది.

**సిద్దిపేట,మార్చి21(నినాదం):** మార్చి 22న ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ఫ్యాక్టరీ ప్రారంభం కానుంది. అదే రోజు రాష్ట్ర రైతులకు రైతు భరోసా నిధుల విడుదల కూడా జరగనుంది. ఈ రెండు కార్యక్రమాలు ఒకే వేదికపై జరగడం తెలంగాణ రైతాంగానికి శుభసూచకంగా భావించాలి. ఈ సందర్భంగా నర్మెటలో భారీ ఏర్పాట్లు చేశారు. సిఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల, పొన్నం తదితరులు పాల్గొంటారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయం కల్పించే పంటగా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఈ నేపథ్యంలో నర్మెట్టలో అత్యాధునిక ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సుమారు 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఫ్యాక్టరీ ఆధునిక సాంకేతికతతో రూపొందించారు.

2

## 32 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

### ఒకరిపై కేసు, బొలెరో స్వాధీనం

**కరీంనగర్ , నినాదం:** గన్నేరువరం మండలం, గునుకుల కొండాపూర్ సమీపంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఓ బొలెరో వాహనాన్ని శనివారం తెల్లవారుజామున స్టేట్ సివిల్ టాస్కు ఫోర్స్ బృందం పట్టుకున్నారు.అనంతరం 32 క్వింటాళ్ల బియ్యంతో సహా బొలేరోను స్థానిక పోలీసు ఠాణాకు కు అప్పగించారు. సివిల్ సప్లై అధికారి బంగారం. నాయబ్ తహసీలదార్ సురేందర్ ఫిర్యాదు మేరకు బాధ్యుడైన బొజ్జరాజు పై కేసునమోదుచేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

# శ్రమ ఫలితం మాది.. శిలాఫలకాలు మీవా?

## నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ మా శ్రమ ఫలితం

- కాళేశ్వరంతో వ్యవసాయాన్ని పండగ చేశాం
- సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి మేం నిర్మించాం
- ఒక్కటంటే ఒక్క పనిచేయని రేవంత్
- ప్రాంభోత్సవాలకు రావడం..రిబ్బన్ కట్ చేయడం మీ వంతా
- మీడియా సమావేశంలో మండిపడ్డ ఎమ్మెల్యే హరీష్ రావు

సిద్దిపేట నియోజకవర్గానికి చేసిన ద్రోహం, నిధుల రద్దుపై ముఖ్యమంత్రి వివరణ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేవంత్ ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో ఏ ఒక్కటీ కాంగ్రెస్ ఇచ్చిందని లేదని.. అవన్నీ బీఆరఎస్ హయాంలో నిర్మించుకున్నవే అని తెలిపారు. శ్రమ ఫలితం మాది, శిలాఫలకాలు మీవా? అంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు.

2




**సిద్దిపేట,మార్చి21(నినాదం):** సీఎం రేవంత్ ఆదివారం సిద్దిపేట పర్యటన నేపథ్యంలో పలు ప్రశ్నలు సంధించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మేం అసెంబ్లీలో చేసిన ఒత్తిడితోనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చిందని హరీశ్ రావు తెలిపారు. మా పోరాటం ఫలితంగానే ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న, పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను హరీశ్ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.సిద్దిపేట జిల్లా నర్మెట్టలో 365 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మించిన ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. 'సీఎం రేవంత్ రెడ్డి రేపు ప్రారంభించే ఆయిల్ ఫ్యాక్టరీ 2021లోనే ప్రారంభించాం. ఈ ఆయిల్ పామ్‌కి ప్రాణాధారం కాళేశ్వరం ప్రాజెక్టు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం

## యుద్ధ రీతులు మారుతున్నాయి

### యువత దేశ రక్షణకు నడుం బిగించాలి
### కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

2



**న్యూఢిల్లీ,మార్చి21(నినాదం):** నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.ఆధునిక యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అందులో భాగంగానే సాయుధ దళాలకు అధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం క్రుషి చేస్తోందన్నారు. దేశ రక్షణలో యువత కూడా తమ వంతు పాత్ర పోషించాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్యనైనా ఎదుర్కొగలిగేలా క్రమశిక్షణ, మానసిక ధ్రుఢత్వం పెంపొందించుకోవాలన్నారు.

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

- పార్టీ మారే ఆలోచన విరమించుకోవాలని వినతి
- పార్టీలో అవమానం జరుగుతుంటే ఎలా అని జీవన్ నిలదీత
- భవిష్యత్ కార్యాచరణను నేడు చెబుతానన్న జీవన్ రెడ్డి

2



## స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

### ఎమ్మెల్యే దానంకు క్లీన్ చిట్‌పై బిజెపి ఆగ్రహం

**స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్**

2


**హైదరాబాద్, నినాదం:** తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల అంశం మరోసారి న్యాయస్థానం చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు సంబంధించి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన క్లీన్ చిట్ రాజ్యాంగ విరుద్ధమని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. గత సాధారణ ఎన్నికల్లో బీఆరఎస్ పార్టీ తరపున ఖైరతాబాద్ నుంచి గెలుపొందిన దానం నాగేందర్, ఆ తర్వాత అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు.

## గ్యాస్ కొరత నివారణకు కేంద్రం చర్యలు

### 20శాతం అదనపు కమర్షియల్ గ్యాస్ సరఫరా

**న్యూఢిల్లీ,మార్చి21(నినాదం):** వాణిజ్య గ్యాస్ కొరతను అధిగమించేందుకు చర్యలు చేపట్టిన కేంద్రం.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు వాణిజ్య ఎల్పీజీలో అదనంగా 20శాతం కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. తాజా చర్యతో సంక్షోభ కాలానికి ముందున్న కేటాయింపుల్లో 50శాతానికి చేరినట్లయ్యిందని పేర్కొంది. అయితే, వీటిలో హోటళ్లు, రెస్టరంట్లు, దాబాలు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, సబ్సిడీల్లో ఆహారం అందించే కేంద్రాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం సూచించింది.

2




## తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

### ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు

2



# శ్రమ ఫలితం మాది.. శిలాఫలకాలు మీవా?

**మొదటిపేజీ తరువాయి**

అన్న రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలి. కాళేశ్వరాన్ని అడ్డుకోవడానికి ఆయన అనేక ప్రయత్నాలు చేశారు. మొక్కవోని దీక్షతో పూర్తి చేసింది మేము. ఇప్పటికైనా కాళేశ్వరంపై చిల్లర మాటలు మానుకో అని హితవు చెప్పారు. ఆ ప్రాజెక్టు పూర్తి చేయడంలో అనేక విధాలుగా శ్రమ పడ్డాం. 20 కోట్ల లీటర్ల నీటి నిలువ సామర్థ్యం కలిగిన పాండ్ నిర్మించాం. మలేషియా టెక్నాలజీతో ఇండియాలోనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించాం అన్నారు. బీఆరఎస్ కృషి ఫలితమే ఆయిల్ ఫ్యాక్టరీ. దాన్ని ఈరోజు రేవంత్ రెడ్డి ప్రారంభిస్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్, జిల్లా జైలు, ఆయుష్ ఆస్పత్రి, రెండు పీహెచ్సీలు నేను ఆరోగ్య శాఖ మంత్రిగా ఉండగా మంజూరు చేసి పూర్తి చేసినవి. వీటికి మీరు శిలాఫలకం వేసుకుని ప్రారంభిస్తున్నారు. ఇందులో మీరు చేసిందేమీ లేదు. మేము ఆలయాలు, విద్యాలయాలు, రిజర్వాయర్లు, జైళ్లు నిర్మించాం. రూ.78కోట్లతో 30 ఎకరాల్లో జిల్లా జైలు నిర్మించాం. కట్టించింది మేము, శిలాఫలకం మీరు వేసుకున్నారు. చేసుకోనాకేమీ ఈర్ష్య లేదు. కానీ శ్రమ ఎవరిది, శిలాఫలకం ఎవరిది?. కనపడిన ప్రతి దేవుడు మీద ఒట్టుపెట్టి రుణమాఫీ అన్నారు.. అది ఇప్పటికీ కాలేదు. సిద్దిపేట జిల్లాలో 22వేల మంది రైతులకు రూ.300కోట్ల రుణమాఫీ పెండింగ్‌లో ఉంది. ఒక నర్మేట్టలోనే 350మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మా నియోజకవర్గంలో రుణమాఫీ అయ్యింది 48 శాతం, కానిది 52 శాతం. మూడు పంటలకు రైతు బంధు ఎగ్గొట్టారు. రేపు ఏ రైతు బంధు ఇస్తున్నారో రేవంత్ తెలపాలని డిమాండ్ చేశారు. పంటల బీమా రెండున్నర ఏళ్లుగా చేయలేదు. నష్టపోయిన రైతులకి ఒక్క రూపాయీ పరిహారం ఇవ్వలేదు. వడగళ్ల బాధిత రైతులకు నిధులు విడుదల చేయాలి. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఏ ఒక్క పనీ సిద్దిపేటకు ఇవ్వలేదు. సిద్దిపేటలో జరుగుతున్న రూ.1071 కోట్ల పనులనూ అర్ధాంతరంగా రద్దు చేశారు. ఆ నిధులు వెంటనే పునరుద్ధరించాలి. ప్రభుత్వ వెటర్నరీ కాలేజీ, రంగనాయకసాగర్ టూరిజం, శిల్పారామం, స్పోర్ట్స్ స్టేడియం ఇలా అనేక పనులు రద్దు చేశారు. వీటిలో కొన్నిటిని కొడంగల్?కు రేవంత్ ఎత్తుకుపోయారు. ఇది ఒక ముఖ్యమంత్రి చేయాల్సిన పనేనా?. ఏ ముఖం పెట్టుకుని సిద్దిపేటకు వస్తున్నారు. మీరు రద్దు చేసిన గొప్పలు చెప్పుకోవడానికి వస్తున్నావా?' అంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో దాదాపు 10 లక్షల ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారని హరీశ్‌రావు తెలిపారు. క్వింటాల్‌కు రూ. 2400 మద్దతు ధర ఉంటే.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో నిన్నటిదాకా రైతులు బయట దళారులకు రూ. 1600`1700లకే అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందే ఈ కేంద్రాలను ప్రారంభించి ఉంటే రైతులందరికీ మేలు జరిగేదని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే 20 నుంచి 25 శాతం మొక్కజొన్న దళారుల చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. ఇప్పటికైనా రైతులు ఈ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు.

మన ప్రాంతంలో సన్‌ఫ్లవర్ కూడా బాగా సాగు చేస్తున్నారని.. దానికి కూడా ఈరోజు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని హరీశ్‌రావు తెలిపారు. సన్‌ఫ్లవర్‌కు క్వింటాల్‌కు రూ. 7721 మద్దతు ధర ఉందని.. రైతులు దీన్ని సద్వినియోగం చేసుకుని మంచి ఆదాయం పొందాలని సూచించారు. సన్‌ఫ్లవర్ తక్కువ కాలంలో పూర్తయ్యే పంట.. దీనివల్ల అధిక ఆదాయంతో పాటు మంచి దిగుబడి కూడా వస్తుందని అన్నారు. పంట మార్పిడికి కూడా ఇది ఎంతో ఉపయోగకరమని అన్నారు. రాబోయే రోజుల్లో దీన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ యాసంగిలో మన సిద్దిపేట ప్రాంతంలో ఇంత మంచి దిగుబడి వస్తుందంటే, ఈ స్థాయిలో పంటలు పండుతున్నాయంటే దానికి ఏకైక కారణం కాళేశ్వరం ప్రాజెక్టే అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు సిద్దిపేట నియోజకవర్గంలో యాసంగి సాగు కేవలం 8 వేల ఎకరాలు మాత్రమే ఉండేది. కానీ ఇవాళ కాళేశ్వరం జలాల పుణ్యమా అని అది పదింతలు పెరిగి ఏకంగా 80 వేల ఎకరాల్లో యాసంగి సాగు జరుగుతోందని తెలిపారు. 2005వ సంవత్సరంలో కరువు వచ్చిన పరిస్థితులు నాకు ఇంకా బాగా గుర్తున్నాయన్నారు. తాగడానికి నీళ్లు లేక, పశువులకు గడ్డి లేక అల్లాడిపోయామని పేర్కొన్నారు. పశువులను బతికించుకోవడానికి చిన్నకోడూరు, రాజగోపాల్‌పేట, నంగునూరులో పశుగ్రాస కేంద్రాలు పెట్టి ఆంధ్రా నుంచి 40 లక్షల మెట్రిక్ టన్నుల గడ్డి తెచ్చి రైతులకు సప్లై చేశామని గుర్తుచేశారు. కానీ కాళేశ్వరం ప్రాజెక్టు వచ్చాక సిద్దిపేట దరిదాపుల్లో కరువు అనే మాటే లేదని తెలిపారు. వానలు పడినా, పడకపోయినా



కాలంతో సంబంధం లేకుండా రైతులు రెండు పంటలు పండిస్తూ బంగారం లాంటి దిగుబడులు సాధిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. ఒకప్పుడు కరువుతో అల్లాడిన మన ప్రాంతానికి కాళేశ్వరం ప్రాజెక్టు ఒక వరంలా మారిందని హరీశ్‌రావు తెలిపారు. ఈ ప్రాజెక్టు మన ప్రాంత రూపురేఖలను మార్చేసి, వ్యవసాయానికి కొత్త దిశానిర్దేశర చేసిందని పేర్కొన్నారు. రైతులు ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే తమ పంటను అమ్ముకుని ప్రభుత్వ మద్దతు ధరను పూర్తిస్థాయిలో పొందాలని సూచించారు

## ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రభావం

**న్యూఢిల్లీ,మార్చి21(నినాదం):**

పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. రూపాయి విలువ పతనం, ఇంధనం ధరలు పెరగడం రాబోయే ద్రవ్యోల్బణ సునామీకి సంకేతాలని అన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు. 'డాలర్‌తో పోల్చిస్తే రూపాయి విలువ ఆల్ టైమ్ కనిష్టానికి పడిపోయింది. త్వరలోనే అది 100 మార్క్‌ను తాకవచ్చు. పారిశ్రామిక ఇంధనం ధరల్లో స్వల్ప పెరుగుదల చోటుచేసుకుంది. ఇవి కేవలం గణాంకాలు కావు. ద్రవ్యోల్బణం పెరగబోతోందనడానికి సంకేతాలు' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కరెన్సీ పతనం, ధరలు పెరుగుదల ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. ఇది సాధారణ పరిస్థితి అని ప్రభుత్వం చెప్పవచ్చు కానీ వాస్తవం అందుకు భిన్నంగా ఉందని, సామాన్యుడి జేబుకు చిల్లుపడుతుందని అన్నారు. సామాన్యుడిపై నాలుగు రకాలుగా ద్రవ్యోల్బణం ప్రభావం పడుతుందని రాహుల్ పేర్కొన్నారు. వస్తువుల ఉత్పత్తి, రవాణా ఖర్చులు పెరుగుతాయని, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై (ఎంఎసఎంఈ) తీవ్ర ప్రభావం పడి అవి కుదేలవు తాయని, ప్రతి వస్తువు ధర పెరిగిపోతుందని, విదేశీ పెట్టుబడులు దేశం నుంచి వేగంగా తరలిపోతాయని, ఇందువల్ల స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడికి లోనవుతాయని చెప్పారు. త్వరలో నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఎన్నికలు జరుగనున్నాయని, అవి పూర్తి కాగానే పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ ధరలను ప్రభుత్వం భారీగా పెంచుతుందని రాహుల్ జోస్యం చెప్పారు. కేంద్రంపై నేరుగా విరుచుపడుతూ... ఆర్థిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే స్పష్టమైన ప్రణాళిక ఏదీ కేంద్రం వద్ద లేదనీ అన్నారు. 'మోదీ ప్రభుత్వానికి దిశానిర్దేశర కానీ వ్యూహం కానీ లేవు. వారి వద్ద ఒట్టి మాటలే ఉన్నాయి. ప్రభుత్వం ఏమి చెబుతుందనేది కాదు..సామాన్యుడి పళ్ళెంలో ఏమి మిగిలిందనేదే అసలు ప్రశ్న' అని రాహుల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## యుద్ధరీతులు మారుతున్నాయి

ప్రస్తుతం యుద్ధం సరిహద్దులను దాటిందని.. ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలు కూడా జాతీయ భద్రతలో భాగమయ్యాయని అన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి ప్రతి పౌరుడు అన్ని వేళలా దేశ రక్షణ కోసం సన్నద్ధమై ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. సైన్యం, పౌరులు బలంగా ఉన్నప్పుడే దేశం ముందడుగు వేస్తుందన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)లో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు తెలిపారు. అంతే కాకుండా ప్రజా`ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతుండడాన్ని చరిత్రాత్మకమైన ముందడుగు అని అభివర్ణించారు. ఈ నిర్ణయం దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందన్నారు. బాలికా క్యాడెట్లు తమ సామర్థ్యాలను నిరంతరం నిరూపించుకుంటున్నారని, వివిధ రంగాలలో భవిష్యత్ నాయకులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు.

## గ్యాస్ కొరత నివారణకు కేంద్రం చర్యలు

చమురు కంపెనీల వద్ద రిజిస్టరైన వాణిజ్య సంస్థలతోపాటు పీఎన్‌జీ (పైపు ద్వారా గ్యాస్ పంపిణీ) కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వాటికే ఈ అదనపు కేటాయింపు వర్తిస్తుందని కేంద్రం పేర్కొంది. మార్చి 23 నుంచి నుంచి ఈ అదనపు కేటాయింపులు సరఫరా చేస్తామని తెలిపింది. దీంతోపాటు వలస కూలీలకు ఐదు కిలోల గ్యాస్ సిలిండర్లు అందజేయాలని సూచించింది. సిలిండర్లు పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన నిఘా పెట్టాలని ఆదేశించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పెట్రోలియంశాఖ కార్యదర్శి లేఖ రాశారు.

## స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్

కాంగ్రెస్ కండువా కప్పుకోవడమే కాకుండా, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎంపీ ఎన్నికల్లో కూడా పోటీ చేశారు. బీఆరఎస్ బీ ఫామ్ ద్వారా గెలిచి మరో పార్టీలోకి వెళ్లినందున ఆయనపై అనర్హత వేటు వేయాలని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గతంలోనే స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణ జరిపిన స్పీకర్, దానం నాగేందర్ అసలు పార్టీ మారలేదని, ఆయనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని క్లీన్ చిట్ ఇచ్చారు. అయితే, బహిరంగంగానే పార్టీ మారిన వ్యక్తికి స్పీకర్ ఇలాంటి తీర్పు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ ఏలేటి మహేశ్వర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌లో అసెంబ్లీ స్పీకర్‌ను , దానం నాగేందర్‌ను ప్రతివాదులుగా చేర్చారు.ఈ కీలక పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం సోమవారం విచారణ జరపనుంది. స్పీకర్ నిర్ణయంపై కోర్టు ఏ రకమైన స్పందన తెలియజేస్తుందోనని రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ విచారణలో పిటిషనర్ తరపున, స్పీకర్ తరపున , దానం నాగేందర్ తరపు న్యాయవాదులు తమ వాదనలను వినిపించనున్నారు.

## జీవన్‌రెడ్డితో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి చర్చలు

**జగిత్యాల,మార్చి21(నినాదం):**

పార్టీ మారతానన్న కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం భేటీ అయ్యారు. గంటకుపైగా సమావేశమయ్యారు. పార్టీలో గౌరవం దక్కడం లేదని ఈ సందర్భంగా మంత్రుల ముందు జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అయితే సమస్య ఉంటే అధిష్టానంతో మాట్లాడుదామని, పార్టీ మారే ఆలోచన మంచిది కాదని సూచించారు. దీనికి జీవన్ రెడ్డి పెద్దగా స్పందించలేదు. ఈ భేటీ అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. జీవన్‌రెడ్డి 4 దశాబ్దాలుగా పార్టీలో ఉన్నారని అన్నారు. ఆయనతో అనేక అంశాలు చర్చించినట్లు తెలిపారు. ఆయన ఆవేదనను పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఈ భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడారు. తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదన్నారు. పూర్తి వివరాలు రేపు వెల్లడిస్తానని చెప్పారు. కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీపై అసంతృప్తితో ఉన్న మాజీ మంత్రి, సీనియర్ నాయకులు జీవన్‌రెడ్డి పార్టీ మారుతారన్న ప్రచారంతో ఇద్దరు మంత్రులను కాంగ్రెస్ రంగంలోకి దింపింది. పార్టీ వీడకుండా ఉండేందుకు ఆయనతో మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ సంప్రదింపులు మొదలుపెట్టారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తూ.. అసలు కాంగ్రెస్ నాయకులకు అన్యాయం చేయడంపై జీవన్ రెడ్డి కొంతకాలంగా బహిరంగంగానే అసమ్మతి తెలుపు తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కూడా ఆయన అధిష్ఠానాన్ని కోరారు. కానీ హైకమాండ్ పట్టించుకోకపోవడంతో పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌లో సమావేశానికి రావాలని రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ఆహ్వానించారు. కానీ మీనాక్షి నటరాజన్‌తో జరగాల్సిన మీటింగ్‌కు జీవన్ రెడ్డి గైర్హాజరయ్యారు. ఈ క్రమంలోనే జీవన్ రెడ్డి ఇంటికి ఉదయం మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వెళ్లారు. జీవన్ రెడ్డితో అల్పాహారం చేస్తూ ముచ్చటిస్తున్నారు. కాగా, రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా ఇవాళ కాంగ్రెస్ పార్టీ లేదని జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ సమయంలో మీడియాను లోపలికి అనుమతించకుండా రహస్యంగా చర్చించారు. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేస్తున్నారని సమాచారం.

## తెలుగు రాష్ట్రాల్లో రంజాన్ సందడి

**హైదరాబాద్,మార్చి21(నినాదం):**

దేశవ్యాప్తంగా రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అల్లాహ్‌ను స్మరించుకుంటూ ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. తెలుగు రాష్ట్రాల్లోనూ రంజాన్ శోభ కనిపించింది. పవిత్ర దినాన్ని పురస్కరించుకుని హైదరాబాద్, విజయవాడ, వరంగల్, విశాఖ సహా గ్రామగ్రామాన ప్రత్యేక ప్రార్థనలు జరుగుతున్నాయి. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. హైదరాబాద్ మీరాలం ఈద్గా వద్ద వేలాదిగా ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో వందలాది ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు చేశారు. అలాగే పాతబస్తీ, యనమలకుదురు ప్రాంతాల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రార్థనల్లో ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫరూక్ షుబ్లీ, టీడీపీ నేత నాగుల్ మీరా, బీజేపీ నేత సయ్యద్ బాషా, వైసీపీ నేత దేవినేని అవినాశ్ పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం

**ఘనంగా స్వాగతించి, వేదాశీర్వచనం చేసిన పండితులు**

**వెంగమాంబ అన్నసత్రంలో భక్తులకు ఆహారం వడ్డింపు**

**ఎఐ ద్వారా దర్శనం సులువు చేసే చర్యలు**

**భక్తులను నేరుగా కలుసుకుని చర్చించి చంద్రబాబు**

తిరుమల : సీఎం చంద్రబాబు కుటుంబం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా శ్రీవారి సేవలో చంద్రబాబు కుటుంబం పాల్గొంది. ఆలయ మహాద్వారం వద్ద వారికి ఈవో, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు చంద్రబాబు కుటుంబం స్వయంగా వడ్డించింది. దేవాన్ష్ పేరుతో ఒక్క రోజు అన్నదాన వితరణకు రూ.44 లక్షల విరాళం అందించారు. వెంగమాంబ సత్రం నుంచి పద్మావతి వసతిగృహానికి వెళ్తూ సీఎం మధ్యలో ఆగారు. లేపాక్షి కూడలిలో భక్తులతో మాట్లాడారు. ఓ చిన్నారిని ఎత్తుకుని ముద్దాడారు. భక్తుల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అనంతరం తిరుమలలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. తితిదే ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. తిరుమలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. ముందస్తుగా గుర్తించి వెంటనే పరిష్కారం చూపే విధంగా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించిన సమయం నుంచి.. శ్రీవారి దర్శనం పూర్తి చేసి తిరుగు ప్రయాణం అయ్యే వరకు.. వారికి అందుతున్న సౌకర్యాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుమలలో సామాన్య భక్తుడిలా మారిపోయారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆయన తన కాన్వాయ్‌ను పక్కన పెట్టి, తిరుమల వీధుల్లో కాలినడకన తిరుగుతూ భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టీటీడీ అందిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తిరుమల ప్రసాదం విశిష్ఠతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్యమంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సందర్భంగా సీఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబోతున్నామని వెల్లడించారు. టెక్నాలజీ సాయంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టీటీడీ చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మరోవైపు.. తిరుమల పర్యటనను ముగించుకొని రోడ్డు మార్గాన మంత్రి లోకేష్, భువనేశ్వరి, దేవాన్ష్ రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు .

## పేద ముస్లిం కుటుంబానికి లోకేశ్ హామీ

గుంటూరు : గతేడాది పవిత్ర రంజాన్ సందర్భంగా పేద ముస్లీం మైనార్టీ సోదరుడికి ఇచ్చిన హామీని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నెరవేర్చారు. రంజాన్ వేళ మంగళగిరి బస్టాండ్ సమీపంలో ఉండే షేక్ షహెన్షా ఇంటిని మంత్రి ఆకస్మికంగా సందర్శించారు. అతడి కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి లోకేశ్ ఇఫ్తార్ విందు స్వీకరించారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఇఫ్తార్ విందు సందర్భంగా షహెన్షా నివసిస్తున్న ఇంటిని మంత్రి పరిశీలించి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమ పూర్వీకులు నిర్మించిన రేకుల ఇంటి స్థానంలో నూతన ఇల్లు నిర్మించి తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు మంత్రి లోకేశ్‌ను కోరారు. షహెన్షా కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, నూతన గృహం నిర్మించి ఇస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ఏడాది తిరగకముందే నూతన ఇంటిని నిర్మించి షేక్ షహెన్షా కుటుంబసభ్యులకు అప్పగించారు.

## ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో మంటలు

**డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమం**

విజయనగరం : జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. రామభద్రాపురం మండలం తారాపురం వద్ద బస్సులో నుంచి మంటలు చెలరేగాయి. దీంతో బస్సు పూర్తిగా దగ్ధమైంది. భువనేశ్వర్ నుంచి మల్కాన్‌గిరి వెళ్తుండగా వెనుక టైర్ పేలడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు వెనుక టైర్ పేలి మంటలు అంటుకోవడంతో అప్రమత్తమైన డ్రైవర్.. వెంటనే ప్రయాణికులను దించేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉండగా.. ఎవరికీ ఏ గాయం కాలేదు. అయితే బస్సు మాత్రం పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో ఒడిశాకు చెందిన ఒక ఎమ్మెల్యే కూడా ప్రయాణం చేస్తున్నట్లు సమాచారం. కాగా, బస్సు ప్రమాదం గురించి సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇక పోలీసులు కూడా ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రయాణికులను ప్రత్యామ్నయ మార్గాల్లో గమ్యస్థానాలకు పంపించేశారు.

## మొన్న భార్య ...నేడు భర్త ఆత్మహత్య

**కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణం**

కరీంనగర్ : కరీంనగర్ టూటౌన్ ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 18వ తేదీన చంద్రశేఖర్ భార్య దివ్య ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్.. ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని అత్తగారింట్లో ఉరివేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సీతంపేటకు చెందిన దివ్య(30)కు 2016లో దేసు చంద్రశేఖర్‌తో వివాహమైంది. ప్రస్తుతం వీరు కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌లో ఉంటుండగా.. చంద్రశేఖర్ టూటౌన్‌లో ఎస్సైగా పనిచేస్తున్నాడు. వీరికి ఇద్దరు కొడుకులు.చంద్రశేఖర్ రోజుమాదిరిగా మంగళవారం ఇద్దరు పిల్లలను పాఠశాలలో వదిలి డ్యూటీకి వెళ్లాడు. కాగా దివ్య కొద్దిరోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఆమె గన్నేరుపూలు, ఆకులు మిక్సీ చేసుకొని తాగింది. విషయాన్ని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి చెప్పింది. సమాచారం తెలిసిన భర్త దివ్యను హైదరాబాద్‌లోని హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, దివ్య మృతికి చంద్రశేఖర్ కారణమని.. ఆమె అంత్యక్రియల సందర్భంగా ఎస్సైపై సీతంపేట గ్రామస్తులు దాడి చేశారు. ఆ సమయంలో ఆ దాడిని దివ్య తండ్రి అడ్డుకోవడం గమనార్హం. ఈ క్రమంలో భార్య మృతిని తట్టుకోలేని చంద్రశేఖర్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు

**అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకున్న అధికారులు**

రంగారెడ్డి : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన మొయినాబాద్ డ్రగ్స్ కేసులో సిట్ దూకుడు పెంచింది. ఈ కేసు తాజాగా కీలక మలుపు తిరిగింది. డ్రగ్ పెడ్లర్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అభిషేక్ సింగ్‌ను సిట్ బృందం అదుపులోకి తీసుకుంది. నిందితుల్లో ఒక్కరైన కౌశిక్ రవి ఇచ్చిన సమాచారంతో నాలుగు బృందాలుగా ఏర్పడిన సిట్ ఎట్టకేలకు అతణ్ని పట్టుకుంది. హైదరాబాద్‌లోనే అభిషేక్ సింగ్‌ను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. బీఆరఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పార్టీకి అభిషేక్ సింగ్ డ్రగ్స్ సప్లై చేశాడు. హైదరాబాద్ క్షఖీఖీ వద్ద అభిషేక్ సింగ్ నుంచి రోహిత్ డ్రైవర్ శరత్ డ్రగ్స్ కొనుగోలు చేశాడు. అనంతరం పార్టీలో నమిత్ శర్మ, రోహిత్ రెడ్డి, రితేశ్‌రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్, అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి డ్రగ్స్ వినియోగించారు. నమిత్ శర్మ మూడు రకాల డ్రగ్స్ తీసుకున్నట్లు రక్త పరీక్షల్లో బయటపడగా.. పైలట్ రోహిత్ రెడ్డి, రితేశ్ రెడ్డి, అర్జున్ రెడ్డి మద్యంలో కొకైన్ కలుపుకుని తాగినట్లు వైద్య పరీక్షల్లో తేలింది. Sజాగా, అభిషేక్ సింగ్ పోలీసులకు చిక్కడంతో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అభిషేక్ సింగ్ నుంచి ఇంకా ఎవరెవరూ డ్రగ్స్ కొనుగోలు చేశారు? అనే విషయంపైనా కూపీ లాగుతున్నారు సిట్ అధికారులు. మరోవైపు అతని ఫోన్‌లో కీలక డేటా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అభిషేక్ సింగ్ సెల్ ఫోన్ డేటాను విశ్లేస్తున్నారు సిట్ అధికారులు.

## తిరుమలలో ఆహార పరీక్షా కేంద్రం

**ఫుడ్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు**

తిరుమల : తిరుమలలోని పిండి మర ప్రాంతంలో నూతనంగా నిర్మించిన 'వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ' ను సీఎం చంద్రబాబు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసింది. సుమారు రూ.25 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దారు. సుమారు 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో, రెండు అంతస్తుల్లో ఈ ల్యాబ్‌ను నిర్మించారు. ల్యాబ్‌లో సుమారు 50 రకాల అత్యాధునిక యంత్రాలను అమర్చారు, ఇవి ఆహార పదార్థాల్లోని అతి సూక్ష్మమైన లోపాలు కూడా గుర్తించగలవు. భక్తులకు అందించే అన్నప్రసాదాలు , లడ్డూ ప్రసాదాల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, టీటీడీ చైర్మన్, ఈవోతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల పర్యవేక్షణ కోసం తిరుమలలో ఏర్పాటు చేసిన 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర' ప్రాధాన్యతను సీఎం వివరించారు. పారిశుద్ధ్యం నుంచి భద్రత వరకు ప్రతి అంశాన్ని ఈ వ్యవస్థ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

## ఆయిల్ పామ్ ఫ్యాక్టరీకి నేడు సిఎం రేవంత్ ప్రారంభం

ప్రారంభంలో గంటకు 30 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేసే ఈ మిల్లు భవిష్యత్తులో 120 మెట్రిక్ టన్నుల వరకు విస్తరించేలా రూపకల్పన చేశారు. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తికావడంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. ఆయన తరచుగా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల పురోగతిని సమీక్షించారు. అదే విధంగా జంగా రాఘవరెడ్డి నాయకత్వంలో ఆయిల్ ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రికార్డు సమయంలో పూర్తి చేశారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా మార్చి 20 నుంచి 22 వరకు మూడు రోజులపాటు రైతు మేళా నిర్వహిస్తున్నారు. ఇందులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రభుత్వ పథకాలు, ఆయిల్ పామ్ సాగులోని మెలకువలపై రైతులకు ప్రత్యక్ష అవగాహన కల్పిస్తున్నారు. రైతులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయాలని నిర్ణయించింది. మొదటి విడతగా నర్మెట్టలో జరిగే కార్యక్రమంలో 70 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.3,590 కోట్లు నేరుగా జమ చేయనున్నారు. అనంతరం మరో 20 రోజుల తర్వాత రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోగా మిగిలిన రైతులకు కూడా నిధులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొత్తంగా రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సంబంధించి సుమారు రూ.9,000 కోట్లు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ కానున్నాయి. రైతులు వ్యవసాయరంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి .. ఆదాయం బాటలో నడవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు మహోత్సవ మేళా కార్యక్రమాన్ని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్వహిస్తోంది. ఈ మేళాలో వ్యవసాయం, ఉద్యానం, పట్టుపరిశ్రమ, మత్స్యశాఖ, మార్క్‌ఫెడ్, విత్తనాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖలతోపాటు విజయ డైరీ, సాగు యంత్రాలతో 150 స్టాళను ఏర్పాటు చేశారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల, జనగామ, కరీంనగర్, హనుమకొండ, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్, వరంగల్, కామారెడ్డి జిల్లాల నుంచి 50 వేల మందికి పైగా పాల్గొంటున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారిణి స్వరూపరాణి తెలిపారు. సోలార్ సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ యాప్ ద్వారా పొలానికి నీరు అందించే పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. 'ఆటోపామ' సంస్థ వారు ఫోన్‌ను వాడుతూ పంటకు నీరు అందించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. బిందు సేద్యంలో పంటకు మందులను సైతం పంపవచ్చు. ఒకసారి ఏర్పాటు చేసుకుంటే పదేళ్ల పాటు వినియోగించుకోవచ్చని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ఆవిష్కరించిన సవి కృత వ్యవసాయ ప్రదర్శన ఇది. చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభదాయకం. 2`3 ఎకరాలు భూమి ఉన్న రైతులు ఒకే పంట కాకుండా వరి, కందులు, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు, పశుగ్రాసం, కోళ్ల పెంపకం, పాడి పరిశ్రమ, చేపలు, గొర్రెలు, మేకల పెంపకం చేపట్టవచ్చు. రోజూ ఆదాయం పొందవచ్చని విద్యార్థిని శివాని తెలిపారు. సంప్రదాయ పంటలను సాగు చేసి నష్టాలు చవిచూసిన రైతులకు అధిక దిడుబడులు సాధించే దిశగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవిష్కరించిన నూతన వంగడాలు ఇవి. వరి రకాలు తెలంగాణ సోనా, కె.యన్.ఎమ్ 1638, కంది డబ్ల్యూఆర్జీ 255, పెసర ఎం.జి.జి. 385, వేరుశనగ జేసీజీ 2141, ఆముదం పీసీఎస్ 262, తెలంగాణ జొన్న, పాలెం రాగి వంటి సంకర జాతి విత్తనాలను ప్రదర్శించారు.



# పదవులు కాదు.. మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతం

## మంత్రి వాకిటి శ్రీహరి



**అమరచింత, మార్చి 21, (నినాదం):** పదవులు శాశ్వతం కాదని, మనం చేసిన అభివృద్ధి పనులే శాశ్వతమన్నారు. రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి. మక్తల్ నియోజకవర్గం అమరచింత మున్సిపల్ పాలక మండలి సభ్యుల పదవీ బాధ్యతల స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ... రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతి పేదలకు సంక్షేమ పథకాలు అందాలన్నారు.ప్రజల ఆశీర్వాదం తో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ప్రజా సేవకు పునరంకితం అవ్వాలని ఉద్ఘాటించారు.పదవులు శాశ్వతం కాదని మనం చేసిన అభివృద్ధి పనులు మాత్రమే శాశ్వతమని నూతనంగా ఎన్నికైన సభ్యులను ఉద్దేశించి మంత్రి ప్రసంగించారు. ప్రజలు మనపై ఉంచిన నమ్మకాన్ని ఓమ్ము చేయకుండా పని చేయాలని హితవు పలికారు. తాను అలుపెరగకుండా అభివృద్ధి కి కట్టుబడి పని చేస్తున్నానని తెలిపారు.రాజకీయాల్లో కింది స్థాయి నుండి వచ్చిన వ్యక్తిని అని స్పష్టం చేశారు. వాగ్దానం చేసిన పనులు పూర్తి చేసే బాధ్యత నాదన్నారుప్రజా ప్రభుత్వంలో ఇరిగేషన్, ఎడ్యుకేషన్ కు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. బీడీ, చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అమరచింత మండలంలో కొత్త గోదాముల నిర్మాణాలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. వై ఎస్ రాజశేఖర్ రెడ్డి తర్వాత మళ్ళీ ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అవుతున్నట్లు స్పష్టం చేశారు.మండలంలో ఇప్పుడు మంజూరు అయిన 450 ఇందిరమ్మ ఇళ్ళు పూర్తైతే మరో 500 ఇండ్లు ఈ మండలానికి మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు.పేద వాడి ఇంటి నిర్మాణానికి వ్యక్తిగతంగా నేను సహాయం చేస్తానని హామీనిచ్చారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్ లు మీ వార్డుల్లో పేద వాడికి ఇళ్ళు కట్టించినప్పుడే మీరు నాకిచ్చే గౌరవం అని మంత్రి పేర్కొన్నారు. అమరచింత మండలంలో తాగునీటి సమస్య తీర్చేందుకు వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామ ని తెలియజేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా సీసీ రోడ్లు,డ్రైనేజీ నిర్మాణాలను పూర్తి చేసి తీరుతామన్నారు.నాపై నమ్మకం ఉంచి గెలిపించిన అమరచింత మండల ప్రజలకు సేవ చేయడం గొప్ప అదృష్టం గా భావిస్తున్నానని మంత్రి శ్రీహరి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్ పర్సన్ జింక సువర్ణ, రవి, వైస్ చైర్ పర్సన్ రాధా అరుణ్, టీపీసీసీ కల్లు గీత సెల్ చైర్మన్ నాగరాజు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి,మున్సిపల్ కమీషనర్ నూరుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి





**వనపర్తి ప్రతినిధి, మార్చి 21(నినాదం):** రంజాన్ పండుగ సందర్భంగా శనివారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిని వనపర్తిలోని తన స్వగృహంలో ముస్లిం మతపెద్దలు, ముస్లిం సోదరులు కలిశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి ముస్లిం సోదరులకు అలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఈద్గా దగ్గర బిఆర్ఎస్ నాయకులు ముస్లిం సోదరులను కలుసుకొని ఆత్మీయ పలకరింపుతో పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, మురళీ సాగర్, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, ప్రేమ్ నాథ్ రెడ్డి, సునీల్ వాల్మీకి, నీలస్వామి, వెంకటేష్, చిట్యాల రాము, మంద రాము, మైనార్టీ అధ్యక్షులు జోహెబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ మాసం భక్తికి నిదర్శనం

## రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** పవిత్ర రంజాన్ మాసం క్రమశిక్షణ దానగుణం భక్తికి నిదర్శనం అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వనపర్తి జిల్లా కేంద్రంలో ఈద్గా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారతదేశం లౌకిక దేశమని, దేశంలో హిందువుల పండుగ వచ్చిన, ముస్లింల పండుగ వచ్చిన, క్రిస్టియన్ల పండుగ వచ్చిన దేశ ప్రజలందరూ పండుగలను ఘనంగా జరుపుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రజలందరు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆ అల్లాహ్‌ను ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వంగర అంబేద్కర్ సంఘం అధ్యక్షుడిగా గజ్జల సురేష్



**భీమదేవరపల్లి, మార్చి 21 (నినాదం):** భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలోని అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అంబేద్కర్ సంఘం నూతన అధ్యక్షుడిగా గజ్జల సురేష్‌ను గ్రామస్తులు, సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గజ్జల సురేష్‌కు సంఘం పట్ల ఉన్న నిబద్ధత, సేవా దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు. సంఘం అభివృద్ధికి, గ్రామంలోని ఐక్యతను పెంపొందించడానికి సురేష్ కృషి చేస్తారని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గజ్జల సురేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా గ్రామ ప్రజలందరినీ కలుపుకుంటూ సంఘాన్ని ముందుకు నడిపిస్తానని, సమస్యల పరిష్కారం మరియు సామాజిక చైతన్యానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంబేద్కర్ సంఘం సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొని గజ్జల సురేష్‌ను అభినందించారు.

# అగ్నివీర్ నియామకాలను సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి వెల్లడి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** భారత సైన్యంలో 2027 సంవత్సరానికి గానూ వివిధ కేటగిరీల్లో 'అగ్నివీర్' పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమైనట్లు వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లాలోని అర్హులైన అవివాహిత యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అభ్యర్థులు కేవలం ఆన్‌లైన్ ద్వారా www.joinin-dianarmy.nic.in వెబ్‌సైట్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు ఏప్రిల్ 01, 2026 వరకు గడువు ఉందన్నారు. అన్ని అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితిని 21 ఏళ్ల నుండి 22 ఏళ్లకు పెంచడం జరిగిందన్నారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్స్‌మెన్ (10వ తరగతి డ 8వ తరగతి పాస్) కేటగిరి లకు నియామకాలు జరుగుతాయని చెప్పారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ అడ్మిట్ కార్డుల కోసం జూన్ 01 నుండి జూన్ 15, 2026 వరకు నిర్దేశించిన వెబ్సైట్ ద్వారా డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పరీక్ష తెలుగుతో సహా 13 భాషల్లో అందుబాటులో ఉంటుందన్నారు.ఐటిఐ, డిప్లొమా, ఎన్‌సిసి అర్హత కలిగిన అభ్యర్థులకు బోనస్ మార్కులు ఇవ్వబడతాయని తెలిపారు.ఈ నియామక ప్రక్రియ పూర్తిగా అత్యంత పారదర్శకంగా నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామనే మోసగాళ్లను, దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని, కేవలం ప్రతిభ ఆధారంగానే ఎంపిక జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సందేహాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం ఫోన్ నంబర్ 040-27740059 ను సంప్రదించవచ్చని చెప్పారు.

# కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు



**పెబ్బేరు, మార్చి 21(నినాదం):** వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం పాతపల్లి గ్రామంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీలో చేరడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలోని 2వ వార్డు సభ్యురాలు కవిత, 4వ వార్డు సభ్యురాలు ఉషనమ్మ శనివారం మాజీ సర్పంచ్ పి.రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తన నివాస కార్యాలయంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పేద ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పార్టీ మార్పు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇక వీరితో పాటు మరో 25 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కూడా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. కాంగ్రెస్ పాలనలో ప్రతి ఒక్కరికి స్వేచ్ఛ, సమానత్వం లభిస్తుంది అని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు ముత్త రాములు, పాతపల్లి రవీందర్, వెంకటయ్య, శ్రీరాములు, చిరంజీవి తదితర నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పంట నష్టంపై క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టాలి

**అప్పులు చేసిన రైతులకు అండగా ప్రభుత్వం నిలబడాలి**

**అసెంబ్లీ సమావేశాల్లో రైతు సమస్యను ప్రస్తావిస్తాను**

**ముఖ్యమంత్రి, వ్యవసాయ మంత్రి దృష్టికి పంట నష్టం తీసుకెళ్తాం**

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం, మార్చి21(నినాదం):** వడగండ్ల వాన, ఈదురుగాలులకు దెబ్బతిన్న మొక్కజొన్న పంట నష్టానికి రైతులకు తక్షణమే పరిహారం అందేలా ప్రభుత్వంపై వత్తిడి తెస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హామీ ఇచ్చారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో ప్రకృతి వైపరీత్యం వల్ల మొక్కజొన్న పంటకు జరిగిన భారీ నష్టంపై ఆయన శుక్రవారం స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడగండ్ల వానకు, భారీ ఈదురుగాలులకు మండలంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, దీంతో రైతులు ఆర్థికంగా భారీగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో నాశనం కావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి, పంట నష్టాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి వెంటనే పంపాలని సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న ఈ తీవ్రమైన సమస్యను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో స్వయంగా ప్రస్తావిస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, నష్టపోయిన ప్రతి రైతుకు తగిన పరిహారం అందేలా తన వంతు బాధ్యతగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. అన్నదాతలు అధైర్యపడవద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### నెల్లిపాక యువకుడికి గేట్-2026లో ఆల్ ఇండియా 8వ ర్యాంక్..



**అశ్వాపురం, మార్చి 21 (నినాదం):** మండల పరిధిలోని నెల్లిపాక బంజర్ గ్రామానికి చెందిన మండ్రు శంకర్రావు -- మాధవిల కుమారుడు మండ్రు శశిరన్ గేట్-2026 పరీక్షల్లో దేశవ్యాప్తంగా 8వ ర్యాంక్ సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. చిన్న గ్రామం నుంచి జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి ఉన్నత స్థానాన్ని సాధించడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా గ్రామ ప్రముఖులు కొడాలి వెంకటేశ్వరరావు, కమటం వెంకటేశ్వరరావు గ శశిరన్ ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో నెల్లిపాక గ్రామపంచాయతీ సర్పంచ్ మండ్రు వెంకట రామకృష్ణ, ఓబిలినేని వెంకటరమణ తదితరులు పాల్గొని శశిరన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామ యువతకు ఆయన ఆదర్శంగా నిలవాలని వారు పేర్కొన్నారు.

# మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ

- **ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన మేఘారెడ్డి చిన్నారెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా వనపర్తి పట్టణంలోని గోపాల్ పేట రోడ్ లో గల ఈద్గా వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఈద్గా వద్దకు చేరుకుని ముస్లిం సహోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ పండుగ మతసామరస్యానికి ప్రతీకగా నిర్వహించుకుంటారని, రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో నిష్టగా ముస్లిం సోదరులు మాసం మొత్తం ప్రార్థనలు చేసుకుంటారని చెప్పారు. రంజాన్ పండుగ రోజున ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి కుల మతాలకతీతంగా ఈ పండగలో పాల్గొని శుభాకాంక్షలు తెలుసుకోవడం ఐక్యతకు మారుపేరని వారన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, ఖిల్లా ఘణపురం మండల నాయకులు సాయి చరణ్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ముస్లిం సోదరులు, మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం







## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

**కల్వకుర్తి, మార్చి 21 (నినాదం):** ప్రజలందరికీ సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్లు మండలం గుడితండాలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటి లబ్ధిదారులైన కవిత రవీందర్ లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేసేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజేశ్వరి మల్లేష్, ఉపసర్పంచ్ విజయ్ రాథోడ్, మాజీ సర్పంచ్ అంబర్ సింగ్, వార్డు మెంబర్లు సీతారాం, ప్రేమలత,మల్లేష్,తావుర్య నాయకులు హరిలాల్ నాయక్, దేవా,శ్రీను,హరియా తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్లో విద్యకు 8.2% నిధులు కేటాయించడం అన్యాయం

## సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.2% నిధులు కేటాయించడం అన్యాయమని, విద్యారంగం బాగు కోసం ఈ నిధులు సరిపోవని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ రూ.3,24,234 కోట్లలో కేవలం రూ.26,674 కోట్లు మాత్రమే విద్యారంగానికి కేటాయించడం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో విద్యా రంగానికి 15% నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయక పోవడం శోచ నీయమన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ పేరు మీద కొన్ని పాఠశాలల మీద దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం, ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులను పునః సమీక్షించి కనీసం 20% నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి చర్యలు చేపట్టాలని శంకర్ గౌడ్ అన్నారు.పిఆర్సి గడువు ముగిసి 32 నెలలు కావస్తున్న ఇప్పటివరకు రిపోర్టును తెప్పించుకోకపోవడం, అట్టి అంశాన్ని బడ్జెట్లో కనీసంగా ప్రస్తావించకపోవడం అన్యాయం అన్నారు. అదేవిధంగా 2024 మార్చి నుంచి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయ, ఉద్యోగుల పెన్షనరీ బకాయిల చెల్లింపులకు సంబంధించి బడ్జెట్లో ఎలాంటి ప్రస్తావన లేకపోవడం సరికాదన్నారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి విద్యాశాఖను తనే నిర్వహిస్తున్నాను అన్న ముఖ్యమంత్రి విద్యారంగంపై ఇంత చిన్నచూపు చూడడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి విద్యారంగ కేటాయింపులపై పునరాలోచన చేసి కేటాయింపులు పెంచాలని శంకర్ గౌడ్ డిమాండ్ చేశారు.

# ఈద్గాకి లక్ష రూపాయలు విరాళం ప్రకటించిన చలమల్ల కృష్ణారెడ్డి



**మునుగోడు, మార్చి 21 (నినాదం):** మునుగోడు నియోజకవర్గం. యాదాద్రి భువనగిరి జిల్లా, సంస్థాన్ నారాయణపురం. మండలం జనగాం గ్రామపంచాయతీ పరిధిలో జరిగిన రంజాన్ వేడుకలలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలమల్ల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఈద్గా అభివృద్ధి కోసం వారు ఒక లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఈద్గా అభివృద్ధి కోసం ఆర్థిక సాయం ప్రకటించిన చలమల్ల కృష్ణా రెడ్డికి ముస్లిం సోదరులు ధన్యవాదాలు తెలియజేశారు.

# గంటలోపే సెల్‌ఫోన్ అందజేసిన ఎస్ఐ



**ధర్మారం, మార్చి 21 (నినాదం):** మండల కేంద్రానికి చెందిన వైద్యురాలు స్పందన ఈరోజు సాయంత్రం ఏడు గంటల సమయంలో ధర్మారం నుండి ఎండపల్లి బైపాస్ రోడ్ లో బైక్ పై వెళుండగా సెల్ ఫోన్ పడిపోయింది. వెంటనే ఆమె ధర్మారం ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ను సంప్రదించగా వెను వెంటనే ఎస్ఐ స్పందించి వారి సిబ్బంది అయినా సతీష్ తో సెర్చ్ చేసి కొత్తపల్లిలోని ఒక వ్యక్తి వద్ద ఉన్నట్లు కనుక్కొని వెంటనే వారి ఇంటికి వెళ్లి సెల్ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితురాలు అయిన డాక్టర్ స్పందనకు అప్పగించారు. గంట వ్యవధిలోనే స్పందించి ఫోన్ అందించిన ధర్మారం ఎస్సై కి కానిస్టేబుల్ సతీష్ కు వైద్యురాల స్పందన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

# భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



**భీమదేవరపల్లి, మార్చి 21 (నినాదం);** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లిలో రంజాన్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి గ్రామానికి చెందిన ముస్లిం మత పెద్దలు, గ్రామస్తులు, ప్రముఖులు పాల్గొన్నారు. శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవడం గ్రామంలో ఆనంద వాతావరణాన్ని నెలకొల్పింది. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఐక్యతను చాటుకున్నారు.

### నర్మెట్ట ఆయిల్ ఫాం ఫ్యాక్టరీని సందర్శించిన దమ్మపేట మండల నాయకులు



**దమ్మపేట, మార్చి 21(నినాదం):** సిద్దిపేట జిల్లా నంగనూరు మండలంలోని నర్మెట్ట వద్ద నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ నెల 22వ తేదీన ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా 19 నుండి 22 వరకు కొనసాగుతున్న రైతు ఉత్సవాలలో భాగంగా దమ్మపేట మండలానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ శనివారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరావు, దొడ్డకుల రాజేశ్వరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కోయ్యల అచ్యుత్ రావు, ఎర్ర వసంతరావు, యువ నాయకులు కాసాని నాగప్రసాద్, మంగేశ్వరరావు, పొన్నగంటి శ్రీనివాసరావు, శ్రీను, వల్లభనేని అజయ్ రైతులు తదితరుల పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ శాంతి, సామరస్యాలకు ప్రతీక

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్... గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**గద్వాల బ్యూరో మార్చి 21 (నినాదం)**





రంజాన్ పండుగ శాంతి, సామరస్యాలకు ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించడానికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని గద్వాల ఈద్గా వద్ద శనివారం ఉదయం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ రంజాన్ పరస్పర గౌరవం, సేవాభావాన్ని, దాన గుణాన్ని పెంపొందించే పవిత్ర మాసమని తెలిపారు. ముస్లింలు సహా అన్ని మతాల ప్రజలు కలిసి మెలిసి సఖ్యతతో జీవించాలని, సమాజంలో ఐక్యత, సామరస్యాన్ని కాపాడాలని కలెక్టర్ సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే ఐక్యతను కొనసాగిస్తూ జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజలకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ నెల రోజులపాటు ముస్లిం సోదరులు చేసిన ఉపవాస దీక్షల ఫలితంగా అల్లా దీవెనలతో ప్రపంచవ్యాప్తంగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. అన్ని కులాలు, మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ కలిసిమెలిసి జీవించేందుకు రంజాన్ పర్వదినం ఉపకరిస్తుందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను, ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డిను పలువురు ముస్లింలు సన్మానించి, ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, వైస్ చైర్మన్ శంకర్, పలువురు కౌన్సిలర్లు, ముస్లిం మైనారిటీ సంఘాల ప్రతినిధులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మతసామరస్యానికి మచ్చుతునక-మధిర టీచర్స్ కాలనీ







**మధిర, మార్చి 21 (నినాదం):**
మధిర పట్టణంలో మతసామరస్యానికి మచ్చుతునకగా నిలుస్తున్న టీచర్స్ కాలనీ. కుల మతాలకతీతంగా భిన్నత్వంలో ఏకత్వంగా మధిర టీచర్స్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో అన్ని మతాల పండుగలను (క్రిస్టమస్, రంజాన్, ఉగాది, వినాయక చవితి, బతుకమ్మ పండుగ) శుక్రవారం రోజునఒకే వేదికపై ఘనంగా నిర్వహించారు. ముందుగా తెలుగు నూతన సంవత్సరాది (పరాభనామ సంవత్సర) ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులు షేక్ నాగుల్ మీరా, షేక్ ఇబ్రహీం, ఎండి రఫీ మాట్లాడుతూ రంజాన్ అనేది ఇస్లాం క్యాలెండర్ లో ఒక మాసం పేరని, ఈ మాసంలోనే పవిత్ర ఖురాన్ రచించబడిందని, ఈ మాసం చివరి రోజున ఈద్-ఉల్-ఫితర్ జరుపుకుంటారని, పేదవారికి తమ సంపాదనలో 2.5 శాతం దానధర్మాలను చేయాలని, తల్లిదండ్రులను గౌరవ మర్యాదలతో పూజించాలని, కురాన్ లో తెలుపబడిందని వివరించారు. అనంతరం ముందుగా ఉగాది పచ్చడి, పులిహోర, మరియు రంజాన్ పాయసం పంపకం చేసుకొని ఆనందోత్సవాల మధ్య ఆరగించారు. ఇదే వేదికపై కాలనీ గౌరవ సలహాదారు వైవి పున్నారెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ ను కటింగ్ చేసి అందరికీ పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీచర్స్ కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవరకొండ లక్ష్మణ్ బాబు, వెలగపూడి హనుమంతరావు, ఉపాధ్యక్షులు ఎర్రమల వెంకటేశ్వర్ రెడ్డి, గౌరవ సలహాదారులు తలుపుల సాంబయ్య, చీకటి నాగేశ్వర రావు, వైవి పున్నారెడ్డి, కమిటీ సభ్యులు బండారు నాగరాజు, దుద్దుకూరు లింగయ్య, తల్లపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి, కూరపాటి రమేష్, మల్లెల శ్రీనివాస రావు, మహిళా కమిటీ సభ్యులు ఎడారి సత్యవతి, గడ్డం విజయలక్ష్మి, వెలగపూడి కృష్ణవేణి, కాలనీ పెద్దలు పోతురాజు కృష్ణయ్య, తోట నరసింహా రావు, వెంకట్ నారాయణ, శివారెడ్డి, ఆ లోకం సుబ్బారావు, భార్గవ రెడ్డి, కిషోర్ రెడ్డి, వినోద్ రావు, చెన్నయ్య, ఆదామ్, పోతినేని రాజేష్, రాజశేఖర్ రెడ్డి, మరియు కాలనీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# సి సి రోడ్డుకు భూమి పూజ చేసిన వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్

**గద్వాల ప్రతినిధి మార్చి 21 (నినాదం)**

జోగులాంబ గద్వాల్ జిల్లా అయిజ మండలం పరిధిలోని ఉప్పల గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కొబ్బరి కాయ కొట్టి అలంపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప గ్రామ సర్పంచ్ తిమ్మోతి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జయన్న తో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐసీసీ సెక్రటరీ అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ సహకారంతో గ్రామాభివృద్దే లక్ష్యంగా పెట్టుకుని సి సి రోడ్ల పనులు చేపట్టమని అన్నారు. సిసి రోడ్ల విషయమై గ్రామ ప్రజలకు ఎంతోకాలంగా ఎదురుచూసిన సమస్యలు శాశ్వత పరిష్కారాన్ని అందిస్తున్నామని తెలిపారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు భాస్కర్ గౌడ్ లక్ష్మన్న జోగులాంబ గద్వాల జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు లాల్ గౌడు, దేవేందర్, మహేష్, ఉప సర్పంచ్ జమ్మన్న, వార్డ్ నెంబర్లు భార్గవ్ యాదవ్ వీరన్న,మల్లేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మైనార్టీ సెల్ అధ్యక్షులు కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ నాయకులు







**మధిర, మార్చ్ 21, (నినాదం):**
శనివారం రోజున రంజాన్ పండుగ సందర్భంగా పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జహంగీర్ గృహమునందు కుటుంబ సభ్యులను కలసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన మధుర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిర్యాల రమణ గుప్తా, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కోన దని కుమార్, మిరియాల కాశీ విశ్వేశ్వరరావు బాహటం వనజ.



# అండర్ బ్రిడ్జ్ నిర్మాణానికై పోరాటం

**గద్వాల బ్యూరో మార్చి 21 (నినాదం)**
గట్టు మండలము రాయపురం స్టేజ్ 214/100 భారత్ మాల రోడ్డు కలుస్తున్న దగ్గర అండర్ బ్రిడ్జి నిర్మాణం కై మరియు గట్టు మండలం కు లింకు రోడ్డు కై మాజీ సింగల్ విండో చైర్మన్ గౌళ్ళ రాముడు ఆధ్వర్యంలో నడుస్తున్న రిలే నిరాహార దీక్షలు 33వ రోజుకు చేరుకుంది గట్టు ఆరగిద్ద తప్లమోర్చు గ్రామాల నుంచి మద్దతునిస్తూ మండల అభివృద్ధిని ఆటంక పరచడానికి ఇప్పుడు ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జి ఉందని ఆ ప్రాంతం నిర్మానుష ప్రాంతంగా ఉండడం వల్ల హత్యలకు అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఎక్కువగా ఉండి కొట్లాటలకు దారి తీసే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గట్టు గుణారస్వామి రాయపురం సర్పంచ్ భర్త మబ్బు తిమ్మప్ప అమ్మన్న గౌండ్ల వెంకటన్న మాజీ ఎంపిటిసి రంగస్వామి ఐదవ వార్డ్ మెంబర్ తిమ్మప్ప గౌవుల వీరేష్ సుధాకర్ సాలె కర్రెప్ప డీలర్ రాముడు దండు వీరేష్ డంక రమేష్ పల్లెల మహదేవు ఈదుల బాయి నరసింహులు ఉత్తి మాయల వీరేషు పల్లెల మహదేవ్ ఈదులపై తిమ్మప్ప బుడ్డ నరసింహులు మీసాల గోపాలు మరియు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# సిండికేట్ వ్యాపారాలకు అనకొండ దండ

## ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి, అక్రమ వ్యాపారులపై ఉక్కు పాదం మోపాలి అక్షర మహిళా మండలి డిమాండ్

**మణుగూరు మార్చి 21 (నినాదం):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం లో మణుగూరు, అశ్వాపురం, కరకగూడెం, మండలాల్లో అక్రమ వ్యాపారాలు చేసి అనకొండ గా మారిన దండా సిండికేట్ పై ఉక్కు పాదం మోపాలని రేణుక అక్షరం మహిళా మండలి డిమాండ్ చేసింది. శనివారం మహిళా మండలి కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అధ్యక్షురాలు పూనెం సరోజ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో అక్రమంగా సిండికేట్ వ్యాపారం చేస్తూ కోట్ల రూపాయలు దండుకుంటున్న దండాపై ప్రభుత్వ అధికారులు ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని ఆమెఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ వ్యాపారాలకు సిండికేట్ అంటే దండ,దండ అంటే సిండికేట్ గా మారిందని, ఇటువంటి అక్రమం వ్యాపారాలతో ప్రభుత్వానికి వచ్చే ఆదాయం భారీగా గండి కొడుతున్నారని ఆమె ఆరోపించారు. నియోజకవర్గంలో ఎక్కడ లేని వ్యాపారాలు చిట్టీలు, మద్యం వ్యాపారాలు, రియల్ ఎస్టేట్ దందా, ఫైనాన్సు దందా, ఇసుక, గ్రావెల్, ఆయిల్ బంకులు ఇలా అనేక వ్యాపారాలతో అక్రమాలకు విక్రమార్కుడుగా తయారైన దండా పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు ప్రభుత్వ అధికారులను ఆమె డిమాండ్ చేస్తున్నారు. అక్రమ వ్యాపారాల పేరుతో ఈ దండ పినపాక నియోజకవర్గంలో అన్ని ఏజెన్సీ ప్రాంతాల్లో తన అక్రమ సామ్రాజ్యాన్ని విస్తరించి అమాయకుల గిరిజనుల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. అక్రమ వ్యాపారాలతో కోట్ల రూపాయలు గడించిన ధన దాహం తగ్గని దండాకు ఇసుక గ్రావెల్ కోరీలపై కన్ను పడిందని ఆమె ఆరోపించారు. ఏజెన్సీ గిరిజన ప్రాంతాల్లో అమాయక గిరిజనులు పేరట అనుమతులు పొంది గిరిజనులనుమోసం చేస్తూ కోట్లాది రూపాయల కొల్లగొట్టారని ఆమె ఆరోపించారు. ఇటువంటి అనకొండ లాంటి దండాపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ఆదాయపన్ను శాఖ, జిల్లా కలెక్టర్లు, ఎస్పీ స్థాయి అధికారులు దృష్టి సారించాలనిఆమె డిమాండ్ చేశారు.

### రంజాన్ మాసంలో పాటించిన నిజాయితీ, క్రమశిక్షణ ఏడాదంతా కొనసాగిస్తే

# ఉన్నత పౌరులుగా ఎదగొచ్చు

## ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆధ్యాత్మిక గురువులు మౌలానా షేక్ ముజాహిద్





**మధిర, మార్చి 21 (నినాదం):**
రంజాన్ మాసంలో పాటించిన నీతి, నిజాయితీ, క్రమశిక్షణ, ఆధ్యాత్మిక మార్గాన్ని ఏడాదంతా కొనసాగిస్తే ఉన్నత పౌరులుగా ఎదగచ్చని తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆధ్యాత్మిక గురువులు మౌలానా షేక్ ముజాహిద్ అన్నారు. శనివారం రంజాన్ పండుగ సందర్భంగా మధిర పట్టణంలో ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతూ రంజాన్ (ఈద్-ఉల్-ఫిట్టర్) వేడుకలను అల్లాహ్ నామస్మరణంతో ముస్లిం సోదరులు పండుగలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మధిర ఈద్గా వద్దకు వందలాదిమంది ముస్లింలు చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జరిగిన ధార్మిక సందేశంలో గురువులు మౌలానా షేక్ ముజాహిద్ రంజాన్ సందేశాన్ని బోధించారు. రంజాన్ పండుగ సమానత్వానికి, మానవత్వానికి, నిలువుటద్దమని ముజాహిద్ తెలిపారు సోదరులు నెలరోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు చేపట్టి, క్రమశిక్షణతో కూడిన జీవనాన్ని గడపటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ పేదవారి ఆకలి తీర్చడంలో రంజాన్ పౌనః పుణ్యాన్ని చాటిందని అలాగే ప్రతి పేదవానికి సహాయపడటం మానవ ధర్మం అని పేర్కొన్నారు.

# ఐజ పట్టణంలో రంజాన్ వేడుకలు

## ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్





**గద్వాల ప్రతినిధి మార్చి 21( నినాదం)**
అయిజ పట్టణంలో రంజాన్ వేడుకలు ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ పాల్గొని ఈద్గా దగ్గర ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనల్లో పట్టణ ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులతో కలసి ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ మత సామరస్యాలకు ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, పట్టణ యువత మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



# భక్తిశ్రద్ధలతో ఈదుల్ ఫితర్ పర్వదిన వేడుకలు

## మతసామరస్యాన్ని ప్రతిబింబించిన ప్రత్యేక నమాజు

**మసీదులు, ఈద్గాలలో వెల్లి విరిసిన ఆధ్యాత్మిక శోభ**

**గొల్లగూడెం ఈద్గాలో హాజరైన తుమ్మల యుగేందర్**

**పిత్రా, జకాతులతో పేదలకు దానధర్మాలు**

**ఖమ్మం , మార్చి 21(నినాదం ):**
దివ్యఖురాన్ దివి నుంచి భువికి చేరిన పవిత్ర మాసం రంజాన్ మాసంలో 30 రోజులపాటు కఠోర రోజా ఉపవాస దీక్షల్లో పాల్గొన్న అనంతరం శనివారం ఈదుల్ ఫితర్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గాలు , మసీదులలో శనివారం ఉదయం ప్రత్యేక ఈద్ నమాజును నిర్వహించారు. ఈద్గాలలో, మసీదులలో మోకాళ్ళపై కూర్చొని మత పెద్దలు ప్రబోధించిన బోధనలను విని నమాజు అనంతరం ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. మతసామరత్యాన్ని ప్రతిబింబిస్తూ బంధువులకు, ఇతర మతాల మిత్రులకు సేమ్యాలు, విందు భోజనాలతో ఆత్మీయతను పంచుకున్నారు. ఫిత్రా, జకాతులతో పేద వర్గాల వారికి దానధర్మాలు చేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఖమ్మం నగరంలోని ఉమెన్స్ కళాశాల వద్ద ఉన్న ఈద్గా, గొల్లగూడెంలోని ఈద్గా , అన్ని మసీదులలో ఈద్-ఉల్-ఫితర్ ప్రత్యేక నమాజును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమెన్స్ కళాశాల వద్ద ఉన్న ఈద్గాకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ముస్లింలు చేరుకొని క్రమశిక్షణతో వరుసగా మోకాళ్ళపై కూర్చొని మత పెద్దల బోధనలను ఆలకించారు. మత పెద్దల దీవెనలు పొందారు. నమాజు అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ చెప్పారు. అనంతరం తమ గృహాలకు ఇతర మతాలకు చెందిన మిత్రులను ఆహ్వానించి సేమియాలు అందించి విందు భోజనాలతో ఆత్మీయ అనుబంధాన్ని పంచారు. పేదలకు దానధర్మాలు చేశారు. నగరంలోని అతిపెద్ద నమాజు వేదికైన గొల్లగూడెం ఈద్గా కు ముస్లింలు వేల సంఖ్యలో హాజరై నమాజులో పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ప్రాంతానికి తరలి రావడంతో పరిసర ప్రాంతాలన్నీ కోలాహలంగా మారింది. ఈ ఈద్గాలో జరిగిన ప్రత్యేక నమాజుకు యువ నాయకులు తుమ్మల యుగేందర్ హాజరైనారు. పోలీస్ శాఖ తరపున ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. నగరంలోని అన్ని మసీదులలో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక నమాజులో పాల్గొనడం తో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.





### భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో రెండో యూనిట్లో

# విద్యుత్ అంతరాయం

## యుద్ధ ప్రాతిపదికపై మరమ్మతులు చేపడుతున్న ఇంజనీరింగ్ సిబ్బంది



**మణుగూరు మార్చి 21 (నినాదం):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో చిక్కుడు గుంట వద్ద ఉన్న భద్రాద్రి పవర్ ప్లాంట్ లో సాంకేతిక లోపంతో రెండో యూనిట్ నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయినట్లు పవర్ ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న తెలిపారు. రెండో యూనిట్లో శుక్రవారం ,శనివారం విద్యుత్ సరఫరా లో తీవ్ర అంతేరాయం ఏర్పడినట్లు ఆయన తెలిపారు. ఇది కేవలం బాయిలర్ పైపులీక్ కావడంతో మరమ్మతులు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు కూడా తెలిపారు. త్వరలో మరమ్మతులు పూర్తిచేసి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టినట్టు చీఫ్ ఇంజనీర్ బిచ్చన్న తెలిపారు.

# మతాలకు అతీతంగా సోదరభావం పెంపొందించాలి

## ఏలూరి శ్రీనివాసరావు... ఈద్గాను సందర్శించి శుభాకాంక్షలు తెలిపిన టీజీవో నేతలు





**ఖమ్మం ప్రతినిధి, మార్చి 21 (నినాదం )**
పవిత్ర రంజాన్ మాసాన్ని పూర్తి చేసుకుని ఈద్-ఉల్-ఫితర్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదరులకు టీజీఈజేఏసీ సెక్రటరీ జనరల్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఏలూరి శ్రీనివాస రావు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లాలోని టీఎన్జీవో కాలనీలో ఉన్న ఈద్గాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఈద్గా అభివృద్ధికి సంబంధించిన పలు సూచనలు చేశారు. అనంతరం జిల్లాలోని ముస్లిం ఉద్యోగుల కుటుంబాలను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడు తూ మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని, సోదరభావం, కరుణ, సహాయసహ కారాలు వంటి మంచి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. రంజాన్ మాసం మనకు క్రమశిక్షణ, సహనం, దానగుణం వంటి గొప్ప సందేశాలను అందిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టీఎన్జీవోజిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాస్, టీజీవో జిల్లా ప్రధాన కార్యదర్శి మోదుగు వేలాద్రి, కోశాధికారి సూరంపల్లి రాంబాబు, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డా. పి. విజయ్ కుమార్, టీఎన్జీవో రాష్ట్ర కార్యదర్శి జెడ్ఎస్ జైపాల్, సంయుక్త కార్యదర్శి బి. చంద్రశేఖర్, ఇ. కోనార్, హాస్టల్ వెల్ఫేర్ అసోసి యేషన్ అధ్యక్షుడు రుక్మారావు, డ్రైవర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యదర్శి గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే టీజీవో మాజీ అధ్యక్షుడు ఎస్కే ఖాజా మియా, ప్రొఫెసర్ ఎండి జకీరుల, మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎండి ముజాహిద్దీన్, మార్కెటింగ్ అధికారి ఎస్కే అలీం, టైగ్లా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ నయం, మైనారిటీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్కే అస్లాం తదితరులు పాల్గొన్నారు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం



# మరోసారి భక్తి భావం చాటిన నీలం మధు





**సొంత నిధులతో చిట్కుల్ లో రామ మందిర నిర్మాణం**

**శాస్త్రోక్తంగా మొదలైన శ్రీ రామచంద్రస్వామి ప్రతిష్టా వేడుకలు.**

**వేద మంత్రాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం**

**పటాన్చెరు/మార్చి 21/ (నినాదం) :** ధర్మ రక్షణే ధ్యేయంగా, భక్తి భావంతో మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ శ్రీ రాముని ఆలయ నిర్మాణాన్ని చేపట్టారు. తన సొంత నిధులతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ జిటిఎన్ కాలనీలో శ్రీ రామచంద్రస్వామి దేవాలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. లోక కళ్యాణార్థం ఆయన చేపట్టిన ఈ శ్రీరామచంద్ర విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ వైభవంగా సాగింది. మొదటి రోజైన శనివారం నీలం మధు దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 8:00 గంటలకు గోపూజ, మందిర ముఖ మండపంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము నిర్వహించి, భక్తుల సమక్షంలో దీక్షాధారణ, రక్షాబంధన, యాగశాల సంస్కారము వంటి క్రతువులను వేద పండితులు శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. అఖండ దీపస్థాపన, వాస్తు మండపారాధనలతో ఆలయ ప్రాంగణం ముచ్చట గొలిపింది. సాయంత్రం వేళ ప్రతిష్టా మూర్తులకు పంచవింశతి (25) కలశ స్నపనం (బింబ శుద్ధి) నిర్వహించారు. అనంతరం మూర్తులకు దీక్షాధారణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట యాగ మండప దేవతా హవనములు జరిపారు. వాస్తు, నవగ్రహ, క్షేత్రపాల దేవతలకు హోమాలు నిర్వహించి పూర్ణాహుతి గావించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో చిట్కుల్ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులతో కలిసి రంజాన్ జరుపుకున్న బీఆర్ఎస్ నాయకులు

మాద్రి పృథ్వీరాజ్ అందరికీ పవిత్ర ఈద్ ఉల్ ఫితర్ పండుగ శుభాకాంక్షలు





**పటాన్చెరు/మార్చి 21/ (నినాదం) :** పవిత్ర రంజాన్ మాసంలో నెల రోజుల పాటు భక్తి, నియమ నిష్టలతో ఉపవాస దీక్షలు ఆచరించి, ఆనందోత్సాహాలతో ఈద్ ఉల్ ఫితర్ పండుగను జరుపుకుంటున్న సందర్భంగా, పటాన్చెరు పట్టణంలోని ఈద్గా వద్ద బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ముస్లిం సోదరులను ఆప్యాయంగా కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ ముస్లిం సోదరులతో అలయ్ బలాయ్ చేసుకొని పరస్పర ప్రేమాభిమానాలు పంచుకున్నా రు. అన్ని మతాల మధ్య సోదరభావం, పరస్పర గౌరవం పెంపొందించడం సమాజ ఐక్యతకు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించిన ఉపవాసాలు, ప్రార్థనలు అల్లాహ్ స్వీకరించి, సమాజంలో శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం మరింత బలపడాలని ఆకాంక్షించారు. అలాగే, పవిత్ర ఈద్ ఉల్ ఫితర్ పండుగ సందర్భంగా సమస్త ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు, వీణ= ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ గారు హృదయపూర్వక పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# మద్యం మత్తులో బావిలో పడి యువకుడు మృతి



**దుబ్బాక, మార్చి21 నినాదం :** మద్యం మత్తులో ప్రమాదవశాత్తు బావిలో పడి ఒక యువకుడు మృతి చెందిన ఘటన దుబ్బాక పట్టణ శివారులో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్ఐ కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం... దుబ్బాక పురపాలిక పరిధిలోని మల్లయ్యపల్లి వార్డుకు చెందిన కోతుల స్వామి (36) కూలి పని చేస్తూ సోదరుని కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. తల్లిదండ్రులు గతంలోనే మరణించగా, స్వామికి ఇంకా వివాహం కాలేదు. ప్రతిరోజు కూలి పనికి వెళ్లే స్వామి, వచ్చిన డబ్బులతో మద్యం సేవించడం అలవాటుగా చేసుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన స్వామి మద్యం సేవించి, సోదరునితో ఫోన్‌లో మాట్లాడిన కొద్దిసేపటికే ఫోన్ స్విచ్ ఆఫ్ అయింది. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది పలుచోట్ల వెతికారు. ఇదిలా ఉండగా, పట్టణ శివారులోని పాతూరి రాంరెడ్డికి చెందిన వ్యవసాయ బావిలో స్వామి ప్రమాదవశాత్తు పడి మృతి చెందినట్లు గుర్తించారు. శనివారం ఉదయం బావిలో మృతదేహాన్ని గమనించిన బావి యజమాని, ఒడ్డుపై ఉన్న చెప్పులు, బట్టలను చూసి అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న స్వామి కుటుంబ సభ్యులు చెప్పులు, బట్టలను గుర్తించి అవి స్వామివేనని ధృవీకరించారు. అనంతరం పోలీసులు పెద్ద క్రేన్ సహాయంతో బావిలోని మృతదేహాన్ని బయటకు తీశారు. శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుడి అన్న కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పతంజలి యోగా సమితికి స్థలం ఇవ్వడంతో పాటు అభివృద్ధి చేయిస్తా

**తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**



**తాండూర్ మార్చి 22( నినాదం ):** తాండూర్ ను డ్రగ్స్ రహితంగా మార్చి ఆరోగ్య తాండూర్ గా మారుస్తానని పతాంజలి యోగా సమితికి స్థలం కేటాయించడంతోపాటు త్వరలోనే ప్రారంభించి అభివృద్ధి చేయిస్తానని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం క్యాంపు కార్యాలయంలో తాండూర్ పతంజలి యోగ సమితి సభ్యులు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు ప్రవీణ్ గురూజీ, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గౌరవ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులు విజయ్ కుమార్, సలహాదారు శ్రీనివాస్, కోశాధికారి రమేష్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి స్థలం విషయమై చర్చించారు. అం దుకు ఎమ్మెల్యే స్పందిస్తూ నర్సింగ్ కాలేజీ వెనక బాగానే ఉన్నా స్థలాన్ని యోగా కమిటీకి కేటాయించడంతోపాటు దాని అభివృద్ధికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. త్వరలోనే స్థలం సరిహద్దులు గుర్తుశీచుకొని ప్రారంభించుకుందామని ఎమ్మెల్యే తెలిపారు. వచ్చే ఆదివారం నాటికి స్థలం యోగ సమితికి అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. పతాంజలి యోగ సమితి సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.





రంజాన్ పర్వదిన సందర్భంగా గాజులరామారం డివిజన్ లోని వివిధ కాలనీలలో ఉన్న మైనారిటీ సోదరులను డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్ కలిసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కస్తూరి బాలరాజు, శివ నాయక్, ప్రసాద్, సమ్మయ్య యాదవ్, గోపాల్, మల్లేశ్, మల్లేశ్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు.

# ఈద్గాల వద్ద భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు





**వికారాబాద్, మార్చి 21(నినాదం) :** జిల్లాలో ముస్లిం సోదరులు నెలవంక దర్శనం తో ఉపవాస దీక్షలు విరమించుకుని శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా ఈద్గాల వద్ద భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో ఈద్గాల వద్ద సందడి నెలకొంది. వయోభేదం లేకుండా పురుషులు నూతన వస్త్రాలు ధరించి సమూహంగా ప్రత్యేక ప్రార్థన స్థలాలు ఈద్గాల వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు మత గ్రంథం కూరాన్ లోని వచనాలను చదివి వివరించారు. అనంతరం ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు చెబుకున్నారు. వికారాబాద్ పట్టణం లో శాసన శభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముస్లిం సోదరులను కలుసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తాండూర్ లో ప్రభుత్వ చిఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి స్థానిక రంజాన్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు, పరిగి పట్టణంలో ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కొడంగల్ లో స్థానిక ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. వికారాబాద్ లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనందం, మున్సిపల్ ఛైర్పర్సన్ అనన్య, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, తదితర ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాల్లో స్థానిక సర్పంచ్ లు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీ సీ లు, నాయకులు స్థానిక ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి,ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ లు తదితర అధికారులు కూడా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా వారి ఆధ్వర్యంలో శాంతి భద్రతల పర్యవేశక్షణ కొనసాగింది. దీంతో ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరగలేదు. దీంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# మైలార్‌దేవపల్లిలో ఘనంగా రంజాన్ వేడుకలు



**రాజేంద్రనగర్, మార్చి 21 (నినాదం):** రాజేంద్రనగర్ నియోజకవర్గం, మైలార్‌దేవపల్లి డివిజన్ పరిధిలో రంజాన్ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. బిజెపి మైనారిటీ మోర్చా డివిజన్ అధ్యక్షులు మజర్ బాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకలకు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనం తరం ఆయన మాట్లాడుతూరంజాన్ పండుగ క్రమశిక్షణకు, దాతృత్వానికి నిదర్శనమని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మైనారిటీ మోర్చా నాయకులు, కార్యకర్తలు ప్రజలందరినీ ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ, నియోజకవర్గ అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు మరియు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు:డివిజన్ అధ్యక్షులు మజర్ బాయ్, జబ్బర్ బాయ్, అబూత్, జుబేర్ ఖాన్, ముస్తఫా. సీనియర్ నాయకులు: రావుల భాస్కర్, మాజీ డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్. ప్రభుదాస్, మహమ్మద్ షౌల్, శ్రీకాంత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి, సచిన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డికి శాలువాతో సన్మానం

**మాజీ మార్కెట్ చైర్మన్ రజనక ప్రవీణ్ కుమార్, బుడ్డ భాగ్యరాజ్**

**మెదక్ జిల్లా డిసిసి కార్యదర్శి బుడ్డ భాగ్యరాజ్ ఎన్నిక**





**చేగుంట: మార్చి 21 (నినాదం) :** చేగుంట మండలం చందాయిపేట మాజీ సర్పంచ్ శనివారం నాడు కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహం నింపుతూ,డిసిసి కార్యదర్శిగా బుడ్డ భాగ్యరాజ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం నాడు హైదరాబాద్‌లోని కొంపల్లిలో, దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి బుడ్డ భాగ్యరాజ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వారితోపాటు డిసీసీ ఉపాధ్యక్షులు రజనక ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు

# వాడవాడలా రంజాన్ వేడుకలు



**అల్వాల్, మార్చి 21( నినాదం) :** అల్వాల్ జి హె చ్ ఎం సి పరిధిలోని మచ్చ బొల్లారం డివిజన్ లోని ఈద్గా వద్ద ప్రార్థనలు పూర్తయిన తర్వాత సహచర ముస్లిం సోదరులకు పరస్పర శు భా కాం క్ష లు అందించుకోవడమే ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. బొల్లారంలో ఈద్గా వద్ద అతిక్ పాష ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంతియాజ్ అస్మతి, రిస్వీ మహమ్మద్, బాయ్ షేక్ ,గౌస్, సయ్యద్ తౌఫిక్, బాబా మహమ్మద్ గౌస్, సయ్యద్ అతీఫ్, మహమ్మద్ ఇస్మాయిల్, సయ్యద్ ,అజీజ్, అబ్దుల్ ,ఆఫీజ్, పాల్గొన్నారు. ఎస్సై దేవేందర్ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు మజీద్ వద్ద భద్రత నిర్వహించారు.

# రంజాన్ వేడుకల్లో పాల్గొని ముస్లిం నేతలను సత్కరించిన పుప్పాల భాస్కర్





**కుత్బుల్లాపూర్, మార్చి 21 (నినాదం) :** రంజాన్ పర్వదినం సందర్భంగా జిహెచ్ఎంసి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ రంజాన్ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు అమీర్ ఖాన్, జబ్బర్, బసిరుద్దీన్, ఇక్బాల్ భాయ్, అలీమ్ భాయ్, ఫిరోజ్, సిద్ధిక్ బిఆర్ఎస్ పార్టీ నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

# విద్య రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

**బడ్జెట్‌లో విద్య రంగానికి మొండి చేయి**

**కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి అరకోరా నిధులు**

**ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బడ్జెట్ పత్రులు దహనం**



**కొత్తగూడెం, మార్చి21(నినాదం) :**


విద్యారంగ పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనేది కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తే అర్థమవుతుందని ఇది ముమ్మాటికి విద్యార్థి వ్యతిరేక ప్రభుత్వం మేనని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ ప్రభుత్వాన్ని విమర్శించారు . స్థానిక కొత్తగూడెం నాడు ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్త గూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో కొత్తగూడెం జిల్లా కేంద్రం లో బడ్జెట్ పతులను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం 8.22% నిధులు కేటాయించడంలోనే విద్యారంగం పట్ల ప్రభుత్వానికి ఎంత చిత్తు శుద్ధి ఉందని తెలిసిందన్నారు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులో డొల్లతనం కనిపిస్తుందని కనీసం విద్యారంగానికి కేటాయించాల్సిన మినిమం బడ్జెట్ను కూడా విద్యారంగని కేటాయించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15% నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ ఈ సంవత్సరానికి 8.22% మాత్రమే కేటాయించడం దారుణం అని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్ల పెండింగ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వ మాత్రం కేవలం పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజు రియంబర్స్ 4.343 కోట్లు కేటాయించి చేతులు దులుపుకోవడంలో ఆంతర్యం ఏమిటని అజిత్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయానికి 1000 కోట్లు చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయానికి 400 కోట్లు కేటాయిస్తే రాష్ట్రంలో ఉన్న మిగతా విశ్వవిద్యాలయాల పరిస్థితి ఏంటని, రాష్ట్రంలో ఉన్న ఉన్నత విశ్వవిద్యాలయాలకు తక్కువ నిధులు. కేటాయించడం తగదు. అని యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు. సుమారుగా 5000 కోట్ల రూపాయలను కేటాయిస్తే. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల పరిస్థితి ఏంటి. సంక్షేమ వసతి గృహాలు. కస్తూరిబా ప్రభుత్వ పాఠశాల ఊసే లేదుఅన్నారు డిగ్రీ కళాశాలలు, ఇంటర్నేషనల్ పాఠశా లలు, స్వంత భవనాలు నిధులు లేవు. ఈ నిధులు విద్యా అభివృద్ధి కోసం కాదు ,విద్యా దారిద్ర్యానికి దారి తీస్తాయని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభు త్వం విద్యారంగానికి 30%అధిక నిధులు కేటాయించి విద్యారంగా అభివృద్ధికి పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఆయన కోరారు.. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్ జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ నాయకులు కళ్యాణ్ మహేష్ నవీన్ ప్రణయ్ దిలీప్ రాజు సందీప్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# లింగం గౌడ్ త్యాగం మరువలేనిది






**చేవెళ్ళ మార్చి 21(నినాదం):** బానూరి లింగం గౌడ్ త్యాగం మరువలేనిది అని, ఆయన ఆశల కోసం కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, లేబర్ సెల్ జనరల్ సెక్రెటరీ (అయన కుమారుడు) శివ శంకర్ గౌడ్ అన్నారు.. సిపిఐ పార్టీ చేవెళ్ల ముద్దుబిడ్డ బడుగుల ఆశాజ్యోతి,బానూరి లింగం గౌడ్ 25వ వర్ధంతిని పురస్కరించుకుని, చేవెళ్ల నియోజకవర్గం,మొయినాబాద్ మండలంలోని తోలుకట్టలోని వారి స్మారక స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు.. ఈ కార్యక్రమానికి సిపిఐ మండల కార్యదర్శి కే శ్రీనివాస్అధ్యక్షతన ఈ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ప్రభులింగం చేవెళ్ల కాంగ్రెస్ లేబర్ సెల్ జనరల్ సెక్రెటరీ ఆయన కుమారుడు శివ శంకర్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగం గౌడ్ ఆశయాల కోసం అనునిత్యం బడుగు బలహీన వర్గాల కోసం పెతందార్ల పైన పోరాటం చేసి నాయకుడు అమర జీవి కామ్రేడ్ లింగం గౌడ ని 25 సంవత్సరాలైనా ఆయన ఆశయాలతో ఆయన అనుకున్న లక్షణాలు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు ఆయన ఆశయమే తోల్కట్ట చౌరస్తాని ఆనాటి పోరాటంలో తోలుకట్ట స్టేజి పైన 500 ప్లాట్ ను ఇప్పించిన ఘనుడని ఈ సందర్భంగా కొనియాడారు బడుగులకు అనునిత్యం ఎక్కడ అన్యాయాలు జరిగినా ఎర్రజెండా నీడన పోరాటాలు చేయాలని వారి ఆశయాలను ఈనాటి యువతరం ముందుకు తీసుకుపోవాలని ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకుడు చేవెళ్ల ఎం సుధాకర్ గౌడ్ చేవెళ్ల మండల కార్యదర్శి సత్తిరెడ్డి మాట్లాడుతూ ఈనాడు ఉన్న పరిస్థితుల్లో గ్రామ గ్రామాలలో పేద ప్రజలకు అండగా ఉండాలని వారికి తోడుగా వారి బాటగా నిలవాలని ఆనాడు బడుగు బలహీన వర్గాలకు పోరాటాలు నిర్వహించి ఎట్టి చాకిరి విముక్తి గురించి బాణవతుల సమస్య మీద కుల సమస్యల పైన నిరుపేదలకు గూడు గుడ్డ కావాలని దున్నేవానికి భూమి అని ఏసేవానికి చెట్టు అని సూసైట్ల గురించి టిప్ టి లైసెన్స్ ఇవ్వాలని ప్రతి గ్రామంలో ఐదు ఎకరాల లవాన్ని భూమి ప్రభుత్వమే కేటాయించాలని ఆనాడు పోరాటాలు నిర్వహించి 560 జీవన తీసుకువచ్చారు.. ఈ కార్యక్రమంలో లింగం గౌడ్ సతీమణి అనసూయ లింగం కుమారులు రాజు ఇంద్రసేన తోపాటు ఆనాటి ఆయన మిత్రులు వెంకటయ్య మల్లేష్ శ్రీనివాస్ బుచ్చయ్య శ్రీశైలం గౌడ్ సాకలి కిష్టయ్య వెంకటయ్య తదితరులు పాల్గొన్నారుశంకరయ్య దాసరి శ్రీనివాస్ బోడ వెంకటయ్య టిఆర్ఎస్ నాయకుడు మండల నాయకుడు బిక్షపతి కావలి సురేష్ ఎండి జలీల్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు...



# వాకింగ్ వర్సెస్ రన్నింగ్..

## బరువు తగ్గడానికి ఏది బెస్ట్..?

ఫిట్‌నెస్‌పై అవగాహన పెరుగుతున్న నేటి కాలంలో బరువు తగ్గడానికి ప్రతి ఒక్కరూ ఎంచుకునే ప్రాథమిక మార్గాలు నడక లేదా పరుగు. అయితే వీటిలో ఏది వేగంగా ఫలితాన్ని ఇస్తుంది?

కీళ్ల నొప్పులు ఉన్నవారు పరిగెత్తవచ్చా? తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలు ఖర్చు చేయాలంటే ఏం చేయాలి? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను ప్రముఖ వైద్య సంస్థల పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

మీ లక్ష్యం తక్కువ సమయంలో ఎక్కువ కేలరీలను దహనం చేయడం అయితే పరుగు అత్యుత్తమ మార్గం. జర్నల్ ఆఫ్ ఒబేసిటీ అధ్యయనం ప్రకారం.. ఒకే దూరాన్ని నడిచే వారితో పోలిస్తే, పరుగెత్తే వారు వేగంగా శరీర కొవ్వును కోల్పోతారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్ నివేదిక ప్రకారం.. 70 కిలోల బరువున్న వ్యక్తి 30 నిమిషాల పరుగు ద్వారా సుమారు 300 కేలరీలను ఖర్చు చేయవచ్చు. అదే సమయంలో చురుకైన నడక ద్వారా కేవలం 140 నుండి 160 కేలరీలు మాత్రమే ఖర్చవుతాయి.

పరుగుతో పోలిస్తే నడకలో తక్కువ కేలరీలు ఖర్చవుతున్నాయని దీనిని తక్కువ అంచనా వేయలేం. అధిక బరువు ఉన్నవారికి, కీళ్ల నొప్పులతో బాధపడేవారికి లేదా కొత్తగా వ్యాయామం ప్రారంభించే వారికి నడక అత్యంత సురక్షితమైనది. పరుగు వల్ల త్వరగా అలసిపోయే అవకాశం ఉంది. కానీ నడకను ఎక్కువ సేపు సులభంగా చేయవచ్చు. మీరు ప్రతిరోజూ గంటసేపు చురుగ్గా నడిస్తే, పరుగు ద్వారా వచ్చే ఫలితాలనే సాధించవచ్చు.

మీరు దేనిని ఎంచుకోవాలనేది మీ శరీర తత్వం, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. వేగంగా బరువు తగ్గడానికి మీకు ఓపిక, కీళ్ల సమస్యలు లేకపోతే పరుగు ఎంచుకోండి. మీకు కీళ్ల నొప్పులు ఉన్నా లేదా వ్యాయామం భారంగా అనిపించకూడదు అనుకున్నా వేగంగా నడవడం ఉత్తమం.

ఏ వ్యాయామమైనా నిలకడ అనేది ముఖ్యం. పరుగు అయినా, నడక అయినా ప్రతిరోజూ క్రమం తప్పకుండా చేసినప్పుడే ఆశించిన ఫలితాలు అందుతాయి. మీ శరీర సామర్థ్యాన్ని బట్టి మీకు నచ్చిన మార్గాన్ని ఎంచుకుని ఆరోగ్యంగా మారండి.



# దొండకాయ పెరుగు పచ్చడి

## ఇలా చేస్తే.. అస్సలు వదలరు!

ముందుగా దొండకాయలను తీసుకుని బాగా క్లీన్ చేసి, చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని ఒక గిన్నె లోకి తీసుకోవాలి. వీటిని ఫ్యాన్ కింద ఎక్కువ సేపు ఆరబెడితే పెరుగు పచ్చడి టేస్టీగా ఉంటుంది.




**కాబట్టి, మీరు కూడా ఈ టిప్ ఫాలో అవ్వండి.**

ఇప్పుడు గ్యాస్ పొయ్యి పెనం పెట్టి కొద్దిగా నూనె వేసి అది కాగిన తర్వాత దొండకాయ ముక్కలను వేసి గోల్డ్ రంగులోకి మారే వరకు స్టవ్ మీదే పెట్టి బాగా వేయించుకోవాలి. అలా వేయించిన తర్వాత వీటిని ఒక ప్లేట్ లోకి తీసుకోవాలి.

నాలుగు కప్పులు పెరుగును ఒక గిన్నెలోకి తీసుకుని, దానిలో ఒక గ్లాస్ నీళ్ళు పోసి మజ్జిగలా చేసుకోవాలి, దానిలో మిక్సీలో పట్టిన మసాలా పేస్ట్, కొద్దిగా పసుపు, రుచికి సరిపడా ఉప్పు వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి.

ఈ పెరుగును తీసుకుని దొండకాయలున్న పెనంలో పోసి మీడియం మంట పై తక్కువ ఫ్లేమ్ తో పది నిముషాలు పాటు స్టవ్ మీదే ఉడికించి ముక్కలకు పెరుగు పట్టే వరకు అలాగే వేయించండి.

**తాలింపు పెట్టుకోవాలి:** చివర్లో కొద్దిగా 5 ఎండుమిర్చి ముక్కలు , కొద్దిగా ఇంగువ, అర టీ స్పూన్ ఆవాలు, అర టీ స్పూన్ జీలకర్ర, కరివేపాకు, కొత్తిమీర వేసి బాగా వేయించి ఈ మిశ్రమాన్ని దొండకాయ పెరుగు పచ్చడిలో వేసుకుంటే టేస్ట్ అదిరిపోతోంది. వేసవి కాలంలో అయితే ఇది సూపర్ అండ్ బెస్ట్ రెసిపీ.

# ఆవు అరుపులో అమ్మ పిలుపు!



భారతదేశంలోని పల్లెటూళ్లలో తెల్లవారుజామున గోమాత అరుపుతోనే రోజు మొదలవుతుంది. తరతరాలుగా వస్తున్న మన సంస్కృతిలో ఆవును ఇంటి మహాలక్ష్మిగా భావించి, పూజ గదిలో దేవుడికి ఇచ్చే గౌరవాన్నే ఆవుకు కూడా ఇస్తారు. రైతులు తమ పొలాల్లో కష్టపడే ఎడ్లను, పాలిచ్చే ఆవులను తమ సొంత బిడ్డల కంటే ఎక్కువగా ప్రేమించడం మనం నిత్యం చూస్తుంటాం. ఒక ఆవు దూడను ప్రసవించినప్పుడు ఆ ఇంట్లో పసిపాప పుట్టినంత సంబరం నెలకొంటుంది. గ్రామీణ ప్రజలు ఆవులకు ముద్దు పేర్లు పెట్టుకుని, వాటితో మనసు విప్పి మాట్లాడుతుంటారు. ఈ అనుబంధం ఎంత గాఢమైనదంటే, ఆవు అనారోగ్యానికి గురైతే ఆ కుటుంబం మొత్తం ఆందోళన చెందుతుంది. ఈ సుందరమైన బంధం మానవత్వానికి, మూగజీవాల పట్ల ఉండే అపారమైన కరుణకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

ఆర్థిక స్వావలంబనలో కామధేనువు గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఆవు ప్రధాన పాత్ర పోషిస్తున్నప్పటికీ, రైతుకు దానిపై ఉండేది కేవలం వ్యాపార దృక్పథం కాదు, అది ఒక ఆత్మీయ అనుబంధం. పండుగ సమయాల్లో, ముఖ్యంగా సంక్రాంతి వంటి పర్వదినాల్లో ఆవులను అందంగా అలంకరించి, వాటికి ప్రత్యేకమైన వంటకాలు తినిపించి కృతజ్ఞత తెలుపుకుంటారు. ఆవు పేడతో ఇళ్లను అలుకుకోవడం, వాకిట్లో ముగ్గులు వేయడం ద్వారా ఇంటికి శుభం కలుగుతుందని నమ్ముతారు. ప్రకృతి ప్రసాదించిన ఈ గొప్ప జీవి నుండి వచ్చే పాలు, పెరుగు, నెయ్యి వంటివి మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆవు ఇచ్చే ప్రతిదీ సమాజానికి ఉపయోగపడేదే కావడంతో, దానిని ఒక 'కామధేనువు'గా భావిస్తూ భక్తితో కొలుస్తారు. ఈ క్రమంలోనే ఆవుల పెంపకం అనేది ఒక వృత్తిగా కాకుండా, ఒక జీవన విధానంగా, ఒక బాధ్యతగా గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతోంది.

నిశ్శబ్ద ప్రేమకు ప్రతిరూపం నేటి యాంత్రిక యుగంలో కూడా పల్లె ప్రజలు ఆవులతో గడిపే సమయాన్ని ఒక గొప్ప మానసిక ప్రశాంతతగా భావిస్తారు. పచ్చని పొలాల్లో ఆవులను మేతకు తీసుకెళ్లే సమయంలో పశువుల కాపరులకు, ఆ మూగజీవాలకు మధ్య ఏర్పడే అవినాభావ సంబంధం వర్ణనాతీతం. ఆవుల మెడలోని గంటల చప్పుడు పల్లెటూరి వాతావరణానికి ఒక ప్రత్యేకమైన లయను ఇస్తుంది. పట్టణాల్లో పెరిగే వారికి ఇది కేవలం ఒక దృశ్యం కావొచ్చు, కానీ గ్రామీణులకు అది ఒక భావోద్వేగం. ఆవు కళ్లలో ఉండే నిశ్శబ్ద ప్రేమను, అది చూపే విశ్వాసాన్ని రైతులు మాత్రమే గుర్తించగలరు. ఆవుల సాన్నిధ్యంలో ఉండటం వల్ల ఒత్తిడి తగ్గి, మనసుకి నెమ్మది కలుగుతుందని అనేక అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. అందుకే, ఆవును ప్రేమించడం అంటే ప్రకృతిని ప్రేమించడమే అని మన గ్రామీణ సంస్కృతి చాటిచెబుతోంది.

గో సంరక్షణే జీవన సంరక్షణ ఆవుకు మనిషికి మధ్య ఉన్న ఈ అనుబంధం ప్రాచీన కాలం నుండి నిరంతరాయంగా సాగుతున్న ఒక పవిత్రమైన ప్రయాణం. ఆవులను హింసించకుండా, వాటిని గౌరవప్రదంగా చూసుకోవడం మన బాధ్యత అని ప్రతి గ్రామీణ గడప మనకు గుర్తుచేస్తుంది. యువత కూడా ఈ గొప్ప సంస్కృతిని అర్థం చేసుకుని, గో సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆవు పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉండటంతో పాటు, సేంద్రియ జీవనశైలికి పునాది పడుతోంది. ఎక్కడైతే ఆవు సంతోషంగా ఉంటుందో, అక్కడ సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయని మన పెద్దల నమ్మకం. ఈ సానుకూల దృక్పథమే తరతరాలుగా ఆవులను మన కుటుంబ సభ్యులుగా మలుచుకునేలా చేసింది. ఈ అపురూపమైన బంధాన్ని కాపాడుకోవడం మనందరి కర్తవ్యం.



**వి. రాజేందర్ నాథ్**
**ఫ్రీలన్స్ జర్నలిస్ట్**
**9440287170**

# ఆరోగ్యంగా ఉండాలంటే..

## జిమ్‌లో గంటల తరబడి గడపక్కర్లేదు..!







**రాత్రికి రాత్రే జిమ్‌లో గంటల తరబడి గడపక్కర్లేదు, ఖరీదైన డైట్ ప్లాన్‌లు పాటించక్కర్లేదంటున్నారు వైద్యనిపుణులు. మన దైనందిన జీవితంలో చేసుకునే చిన్న చిన్న మార్పులే మన ఆరోగ్యాన్ని ఆకాశానికి తీసుకెళ్తాయి. "పర్ఫెక్షన్ కంటే కన్సిస్టెన్సీ (స్థిరత్వం) ముఖ్యం" అని ఆయన చెబుతున్నారు. మరి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆ 8 సూత్రాలు ఏంటో తెలుసుకుందాం.**

నిద్రలేవగానే సోషల్ మీడియా స్క్రోలింగ్ చేయడం వల్ల శరీరంలో 'కార్టిసాల్' (ఒత్తిడి హార్మోన్) స్థాయిలు పెరుగుతాయి. దీనికి బదులుగా కృతజ్ఞతా భావంతో రోజును ప్రారంభించండి. ఇది నాడీ వ్యవస్థను ప్రశాంతపరిచి, జీర్ణక్రియకు సహకరిస్తుంది.
ఉదయాన్నే కనీసం 10 నిమిషాల పాటు ఎండలో గడపండి. ఇది మీ శరీర అంతర్గత గడియారాన్ని రీసెట్ చేస్తుంది, విటమిన్-డిని అందిస్తుంది . మీ మూడ్‌ను మెరుగుపరుస్తుంది.భారీ భోజనం చేసిన తర్వాత చిన్నపాటి నడక జీర్ణక్రియకు ఎంతో మేలు చేస్తుంది. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా, తిన్న తర్వాత వచ్చే బద్ధకాన్ని వదిలిస్తుంది. పెరుగు, దహి, కిమ్చి లేదా గంజి వంటి పదార్థాలను మీ డైట్‌లో చేర్చుకోండి. ఇవి సహజ సిద్ధమైన ప్రోబయోటిక్స్‌గా పనిచేసి మీ పేగుల్లోని మంచి బ్యాక్టీరియాను పెంచుతాయి.

**దీనివల్ల జీర్ణ సంబంధిత సమస్యలు దరిచేరవు.**

పసుపు, అల్లం, జీలకర్ర, సోంపు మరియు మిరియాలు కేవలం రుచి కోసం మాత్రమే కాదు.. ఇవి శరీరంలోని వాపును తగ్గించి, పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.
రాత్రి 8 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు ఏమీ తినకుండా ఉండటం వల్ల మీ జీర్ణవ్యవస్థకు తగినంత విశ్రాంతి లభిస్తుంది. ఈ సమయంలో శరీరం తనను తాను రిపేర్ చేసుకుంటుంది.బ్లూబెర్రీస్, స్ట్రాబెర్రీస్ వంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఒత్తిడిని తగ్గించి, మెదడును చురుగ్గా ఉంచుతాయి. అయితే వీటిని తినే ముందు శుభ్రంగా కడగడం మర్చిపోవద్దు. ఒకరికి పని చేసిన డైట్ అందరికీ పని చేయదు. ప్రతి ఒక్కరి శరీరం, జీర్ణవ్యవస్థ వేరువేరుగా ఉంటాయి. కాబట్టి మీ శరీరానికి ఏది పడుతుందో గమనించి, దాని ప్రకారం ఆహారాన్ని ఎంచుకోవడం నేటి కాలంలో చాలా ముఖ్యం.

# LPGపై కేంద్రం కీలక నిర్ణయం!

## రాష్ట్రాలకు సరఫరా 20 శాతం పెంపు

**ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా LPG కొరత అనే గందరగోళంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోలియం శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రాలకు కమర్షియల్ LPG సరఫరాను 20 శాతం పెంచుతూ తాజా ఆదేశాలు జారీ చేసింది.**



ఈ నిర్ణయం ద్వారా ముఖ్యంగా హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలపై ఉన్న ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ఉంది. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాస్తూ, కమర్షియల్ గ్యాస్ సరఫరా ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న రెస్టారెంట్లు, హోటళ్లు, దాబాలు వంటి వ్యాపార సంస్థలకు నిరంతరంగా గ్యా+ అందేలా చూడాలని సూచించింది. గ్యాస్ కొరత కారణంగా వ్యాపారాలు నిలిచిపోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కూడా కేంద్రం పేర్కొంది.

ఇదే సమయంలో వలస కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వలస కార్మికులకు ఉచితంగా 5 కేజీల సిలిండర్లు అందించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపింది. ఇది తక్కువ ఆదాయం గల కుటుంబాలకు గ్యాస్ ఖర్చు భారాన్ని తగ్గించడంలో సహాయపడనుంది. ఇటీవలి కాలంలో గ్యాస్ వినియోగం పెరుగుతుండటం, సరఫరా గొలుసులో చోటు చేసుకుంటున్న సమస్యలు, అలాగే వ్యాపార రంగం నుంచి వస్తున్న డిమాండ్ పెరగడం వంటి అంశాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సరఫరా పెంపుతో మార్కెట్‌లో స్థిరత్వం వస్తుందని, ధరలపై ఒత్తిడి తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.




### చేతులు కలపనున్న


## వొడాఫోన్-ఐడియా, బీఎస్ఎన్ఎల్..!

అప్పుల్లో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్న టెలికాం సంస్థ వొడాఫోన్ ఐడియా , భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ జట్టు కట్టనున్నాయి. టవర్లు, ఫైబర్ కేబుళ్లు, స్పెక్ట్రమ్‌ను ఈ రెండు సంస్థలు షేర్ చేసుకోనున్నాయి. కవరేజ్ మెరుగుపర్చేందుకు, డబ్బు ఆదా చేసే ఉద్దేశంతో ఈ రెండు సంస్థలు ఇప్పటికే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. నెట్‌వర్క్ నాణ్యతను మెరుగుపర్చేందుకు, 5జీ విస్తరణను వేగవంతం చేసేందుకు ఈ చర్య ఉపయోగపడొచ్చని భావిస్తున్నారు. ఒకట్రెండు కంపెనీలు ఆధిపత్యం చెలాయించకుండా టెలికాం మార్కెట్‌లో పోటీ ఉండేలా ఇది దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 4జీ సైట్స్, అప్‌గ్రేడ్‌ల కోసం ఇవి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇప్పుడు ఈ కంపెనీలు జట్టు కట్టడం వల్ల గ్రామీణప్రాంతాల్లో కూడా కవరేజీ మెరుగుపడనుందని తెలుస్తోంది. బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగ సంస్థ కాగా.. వీఐలో కేంద్రానికి 49 శాతం వాటా ఉంది.




# రూ. 10.69 లక్షలకే స్కోడా కుషాక్ ఫేస్‌లిఫ్ట్

ప్రముఖ కార్ల తయారీ కంపెనీ స్కోడా ఆటో ఇండియా ఎస్‌యూవీ విభాగంలో కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను లాంచ్ చేసింది. దీని ప్రారంభ ధర రూ.10.69 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ నిర్ణయించింది. టాప్ ఎండ్ వేరియంట్ ధర రూ.18.99 లక్షలు (ఎక్స్ షోరూం)గా కంపెనీ పేర్కొంది. క్లాసిక్, సిగ్నేచర్, స్పోర్ట్‌లైన్, ప్రెస్టీజ్, మాంటే కార్లో వంటి 5 వేరియంట్‌లలో ఈ మోడల్‌ను తీసుకొచ్చారు. మార్కెట్లో ఉన్న రెనో డస్టర్, హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్ వంటి కార్లకు గట్టి పోటీ ఇవ్వనుంది.




కుషాక్ ఫేస్‌లిఫ్ట్‌ను కొత్తగా డిజైన్ చేశారు. స్కోడా కొడియాక్ మోడల్ తరహా గ్రిల్, డీఆర్ఎల్ఎస్ హెడ్‌లైట్స్‌తో పాటు స్కోడా బ్రాండ్ ఎల్ఈడీ టెయిల్ లైట్స్‌ను ఇచ్చారు. కారు లోపల యాంబియంట్ లైటింగ్, 2 స్పోక్ స్టీరింగ్ వీల్, 10.25 అంగుళాల డిజిటల్ కాక్‌పిట్‌తో పాటు ఏఐ అసిస్టెంట్‌తో కూడిన 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంది. ఈ సెగ్మెంట్‌లో మొదటి సారి వెనుక సీట్లో మసాజ్ ఫంక్షన్‌ను తీసుకొచ్చారు. పనోరమిక్ సన్‌రూఫ్, పవర్ అడ్జెస్టబుల్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, వైర్ లెస్ ఛార్జింగ్ స్టేషన్, ఆటోమెటిక్ క్లైమెట్ కంట్రోల్ ఫీచర్లను అమర్చారు.

భద్రత కోసం ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, పార్కింగ్ కెమెరా, పార్కింగ్ సెన్సార్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్, ఆటో డిమ్మింగ్ ఇన్‌సైడ్ రియర్ వ్యూమిర్రర్ ఇచ్చారు. ఈ మోడల్స్‌లో అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్, 360 డిగ్రీల కెమెరా లేకపోవడం గమనార్హం. 1.0 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 6 స్పీడ్ మాన్యువల్ లేదా 8 స్పీడ్ టార్క్ కన్వర్టర్ ఆటోమెటిక్ గేర్ బాక్స్ ఆప్షన్లు ఉన్నాయి. 1.5 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్, 7 స్పీడ్ డీసీటీ ఆప్షన్లలో కారు లభిస్తుంది.

# ట్విటర్ కొనుగోలులో మస్క్ మోసాలు..!

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ 2022లో ట్విటర్ ను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు జ్యూరీ నిర్ధరించింది. ట్విటర్ కొనుగోలు చేయడానికి కొన్ని నెలల ముందు ఉద్దేశపూర్వకంగా పెట్టుబడిదార్లను గందరగోళానికి గురిచేసినట్లు తెలిపింది. దానివల్ల ట్విటర్ షేర్ల విలువ తగ్గినట్లు వెల్లడించింది. అయితే స్టాక్ విలువను తగ్గించేందుకు కూడా కుట్ర పన్నారనే ఆరోపణలను తోసిపుచ్చింది. మస్క్ ట్విటర్‌ను కొనుగోలు చేయకముందు దాఖలైన దావాపై విచారణ జరిపిన జ్యూరీ ఈ వ్యాఖ్యలు చేసింది.



ట్విటర్ కొనుగోలు ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసినట్లు మే 2022లో మస్క్ చేసిన రెండు ట్వీట్లు, ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు, పలు ప్రకటనలతో ట్విటర్ వాటాదారులు తమ షేర్లను అమ్ముకునేలా చేశారని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై శాన్ ఫ్రాన్సిస్కో ఫెడరల్ కోర్టులో మార్చి 2న విచారణ ప్రారంభమయ్యింది. దీనిపై విచారణ జరిపిన తొమ్మిది మంది సభ్యుల జ్యూరీ 2022లో మస్క్ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించినట్లు పేర్కొంది. మస్క్ కొనుగోలు చేయడానికి ముందు ట్విటర్ షేర్లు అమ్ముకున్న వాటాదారులకు నష్టపరిహారం చెల్లించాలని టెస్లా అధినేతను ఆదేశించింది.

**యుద్ధం వేళ.. ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా**

కాగా తాను ట్విటర్‌ను కొనుగోలు చేయాలని అనుకున్నప్పుడు అందులో నకిలీ ఖాతాల సంఖ్య అధికంగా ఉందని మస్క్ తెలిపారు. దీంతో కొనుగోలు విషయంలో వెనక్కి తగ్గడానికి ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై ట్విటర్ డెలావేర్‌లోని కోర్టును ఆశ్రయించడంతో.. తన నిర్ణయాన్ని మార్చుకున్నానన్నారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు.

# అంతర్గత రోడ్లను అభివృద్ధి చేస్తా..

**తాళ్ళ ఊకల్ సర్పంచ్ తప్పెట్ల శ్రీను**



**డోర్నకల్ /మరిపెడ, మార్చి 21 (నినాదం):** గ్రామంలోని అంతర్గత రోడ్లను అభివృద్ధి చేసుకోవాలని మరిపెడ మండలం తాళ్లఊకల్ గ్రామ సర్పంచ్ తప్పెట్ల శ్రీను అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి మంజూరైన 11 లక్షల రూపాయల సీసీ రోడ్ల పనులను సర్పంచ్ శ్రీను దగ్గరుండి పర్యవేక్షించారు. గ్రామంలోని ప్రతి వాడ వాడకు మట్టి రోడ్డు లేకుండా సీసీ రోడ్లను వేస్తామన్నారు. గ్రామ అభివృద్ధి కోసం నా వంతు సహాయ, సహకారాలు బాధ్యతలు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ముందుంటానన్నారు. ఈ కార్యక్రమంలో వేంకటేష్,లింగన్న, పుల్లయ్య,శ్రీకాంత్,వార్డ్ మెంబెర్ నల్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల పనులకు భూమిపూజ



**అమరచింత మార్చి 21, (నినాదం):** పాలమూరు ఎంపీ డీకే అరుణ కృషితో నిధులతో ద్వారా నర్వ గ్రామానికి మంజూరైన సీసీ గ్రామంలో నూతనంగా ఎన్నికైన 10,11 వ వార్డు మెంబర్లు లక్ష్మి శ్రీనివాస్ పల్లె భాగ్యమ్మ రాంరెడ్డి చేత 10 వ వార్డులోని చిన్న ఆంజనేయస్వామి దగ్గర భూమి పూజ చేయించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గం నర్వ మండలం లోని నర్వ, లంకల్, యాంకీ,ఎల్లంపల్లి, లక్కరదొడ్డి, ఉండేకోడ్ గ్రామాలకు 30 లక్షల నిధులతో మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యులు డీకే అరుణ కృషివలన నర్వ మండల పూర్తిగా అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ అధ్యక్షుడు అజిత్ సింహ రెడ్డి ఆధ్వర్యంలో పంచాయత్ రాజ్ అధికారుల సూచనలతో పై గ్రామాలలో సీసీ రోడ్ల పనులకు ఆయా గ్రామాల సర్పంచులు,ఉపసర్పంచులు, వార్డు సభ్యుల సమక్షంలో భూమి పూజ కార్యక్రమాలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి హాజరయ్యారు.వీలైనంత త్వరగా సీసీ రోడ్ పూర్తి చేసి ఎంబీ రికార్డు చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్ ,నర్వ మాజీ సర్పంచ్ లు డాక్టర్ వెంకటేశ్వర్ రావు ,కుర్మా రెడ్డి ,సంధ్యా ఆంజనేయులు ,గ్రామ పెద్దలు గౌరారెడ్డి , బొజ్జి రెడ్డి ,తిమ్మక్కొళ్ళ రాములు , టిపిసి మెంబర్ నీరజ్ ,జిల్లా కౌన్సిల్ మెంబర్లు లలితమ్మ ,అంజి ముదిరాజ్ గారు,శ్రీధర్ శెట్టి ,రత్నాకర్ , చిన్న వెంకటన్న ,పెద్ద రాములు ,గంగామోళ్ళ నర్సిమ్మ , డొంగ్ల చెంద్రి ,నజీర్ ,వెంకటేశ్వర్ రెడ్డి ,చెన్నకేశవ, పాల్గొన్నారు.

# విద్యారంగానికి మొండి చెయ్యి



**నూతనకల్, మార్చి 21(నినాదం):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి పిడమర్తి భరత్ ప్రభుత్వానికి విమర్శించారు.రాష్ట్ర 3,24,284 కోట్ల బడ్జెట్లో విద్యారంగానికి 26,674 కోట్లు మాత్రమే కేటాయించి తూతూ మంత్రంగా చూపిస్తుందని అధిక నిధులు కేటాయించి విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని ఆకునూరి మురళి నేతృత్వంలో విద్యా కమిషన్ 18 శాతం నిధులు కేటాయించాలని కానీ కాంగ్రెస్ పార్టీ పెట్టిన మేనిఫెస్టోలో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి నేడు 8.2 శాతం రేవంత్ రెడ్డి సర్కార్ తక్కువ నిధులు కేటాయించాడం ఆవేదన కలుగుతుందని ప్రజా పాలన,ప్రజాస్వామిక పాలన అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి విద్యార్థి నిరుద్యోగులను విస్మరించడం వ్యతిరేకం అన్నారు.

# శివాజీ ఆశయ సాధనలో యువకులు కలిసికట్టుగా పనిచేయాలి

**మంత్రి వాకిటి శ్రీహరి**





**అమరచింత, మార్చి 21, (నినాదం):** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడంపల్లి గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామంలో పెద్ద ఎత్తున శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను మంత్రి అభినందించారు.శివాజీని తన తల్లి జిజియా బాయి మొదటి గురువు అయ్యి ఎలా అయితే యోధుడిగా తీర్చిదిద్దిందో అదేవిధంగా మన పిల్లలను సన్మార్గంలో నడిపించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.ఛత్రపతి శివాజీ స్ఫూర్తి గా బానిస బ్రతుకులకు వ్యతిరేకంగా ఆత్మాభిమానంతో బ్రతకాల్సిన అవసరం ఉందన్నారు. మొగలుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన శివాజీ మహారాజుని ఇంకా వెయ్యి సంవత్సరాలు అయినా శివాజిని ఈ గడ్డ మరువబోదన్నారు. రాజ్యం, సైనికులు చిన్నవే అయినా మొక్కవోని ధైర్యంతో తన సైనికులను నడిపించిన ఘనత శివాజీదన్నారు.నిరంకుశ పాలకులకు ఎదురొడ్డి నిలబడిన మహనీయులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశం కోసం,ధర్మం కోసం పాటుపడిన శివాజీ మహారాజ్ ని చూసి యువత నేర్చుకోవాలని మంత్రి అభిప్రాయపడ్డారు.కులాల పరంగా,మతాల ఆధారంగా దేశాన్ని విభజించొద్దని హితవు పలికారు.ప్రాణం ఉన్నంత వరకు నా ప్రాంత అభివృద్ధికి పాటుపడుతానని మంత్రి తేల్చి చెప్పారు. ఇంకా అక్కడక్కడ ఉన్న తాగునీటి సమస్యను త్వరలోనే తీరుస్తానని హామీనిచ్చారు.ప్రతీ యువకుడు కన్న తల్లిదండ్రులను, ఉన్న ఊరిని మరువకూడదని హితోపదేశం చేశారు. యువత ఆలోచనా విధానంలో మార్పు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుచిత్రమ్మ, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కంబలాపురం రాము, ఉప సర్పంచ్ గట్టు యాదవ్, ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా,వనపర్తి డీసీసీ కార్యదర్శి తులసిరాజ్ యాదవ్, పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలి

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**



**నల్లగొండ ప్రతినిధి మార్చి21 (నినాదం):** మత కలహాలు లేకుండా సోదరభావంతో, ఐక్యతతో రంజాన్ పండుగను జరుపుకోవాలి రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. శనివారం నల్గొండ పట్టణంలోని మునుగోడు రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులతోకలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా గత 30 రోజుల పాటు ముస్లింలు కఠోర దీక్షలు, ప్రార్థనలు చేశారని ,క్రమశిక్షణ,దాతృత్వం, ధార్మిక చింతన కలయిక పవిత్ర రంజాన్ పర్వదినం అని అన్నారు. అల్లా వారందరి జీవితాలలో వెలుగులు నింపాలని మంత్రి ఆకాంక్షిం చారు. అల్లా ఆశీర్వాదంతో సుఖ సంతోషాలతో జీవించాలని అన్నారు.ముస్లిం సోదరులంతా రంజాన్ పండుగను కుటుంబ సభ్యులందరితో కలిసి భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలిపారు. నల్గొండ పట్టణంలోగత 30 సంవత్సరాలుగా హిందు , ముస్లింలు ఎలాంటి మత కలహాలు లేకుండా పండుగలు శాంతియుతంగా జరుపుకుంటున్నారని మంత్రి తెలిపారు.ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తున్నదని, ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో ముస్లింల సంక్షేమానికి రూ. 3,500 కోట్లను కేటాయించినట్లు మంత్రి తెలిపారు. గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లింలకు విద్య, ఉద్యోగ రంగాలలో 4 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రిజర్వేషన్ల వల్ల ముస్లింలు వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై అశోక్ రెడ్డి ,ఏ ఎస్ పీ రమేష్. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ ఆఫీజ్ ఖాన్,తహసిల్దార్ పరుశురాములు, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ , మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి ,మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి ,స్థానిక కార్పొరేటర్ మామిడి కార్తీక్, సుభాష్, నవీన్ ,అధికారులు, మైనార్టీ నాయకులు ,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# ఏఐ ఛాంపియన్స్ ప్రోగ్రామ్ శిక్షణకు కలెక్టర్






**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని మసూరీలో ఉన్న లాల్ బహాదూర్ శాస్త్రి జాతీయ పరిపాలన అకాడమీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విజయవంతంగా పూర్తి చేశారు. మార్చి 16 నుండి 20 వరకు నిర్వహించిన "డిజిటల్ రూపాంతరణ కోసం ఏఐ ఛాంపియన్స్ ప్రోగ్రామ్"లో ఆయన పాల్గొని శిక్షణను పూర్తిచేశారు. ఈ కార్యక్రమం ప్రభుత్వ పరిపాలనలో ఆధునిక సాంకేతికతల వినియోగం, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు ఉపయోగపడుతుంది. ఈ శిక్షణ ద్వారా డిజిటల్ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించేందుకు అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానం లభించనున్నాయి. భవిష్యత్తులో జిల్లాలో పరిపాలనను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా అధికారులు రాహుల్ శర్మను అభినందించారు. కాగా తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపికైన జిల్లా కలెక్టర్లలో ఆయన ఒకరు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆధునిక సాంకేతికతలు, ప్రభుత్వ పరిపాలనలో కృత్రిమ మేధస్సు వినియోగం, ప్రజలకు వేగవంతమైన పారదర్శక సేవలందించడంలో డిజిటల్ పరిజ్ఞానం పాత్ర వంటి ముఖ్యాంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లాలో పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, ప్రజలకు త్వరితగతిన నాణ్యమైన సేవలు అందించేందుకు ఈ ఏఐ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం నుండి ఈ ప్రతిష్ఠాత్మక శిక్షణ కార్యక్రమానికి తనను ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆధునిక సాంకేతికతలను వినియోగించి ప్రజా సేవలను మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

**బాబా, మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీలు**

# సేవా కార్యక్రమాల్లో ముందంజ

**రంజాన్‌లో పేదలకు నిత్యవసరాల పంపిణీ**

**ఆకలి తీర్చడమే మా లక్ష్యం**

**చైర్మన్ మౌలానా అహ్మద్ నద్వి**





**కోదాడ,మార్చి 21(,నినాదం):** బాబా ఎడ్యుకేషనల్, మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీలు పేదల ఆకలి తీర్చడమే ప్రధాన లక్ష్యమని చైర్మన్ మౌలానా అహ్మద్ నద్వి అన్నారు. శనివారం చిలుకూరు మండల కేంద్రంలో రంజాన్ ప్రార్థన అనంతరం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ తెలిపారు. రంజాన్ నెలలో వివిధ ప్రాంతాల్లో వందలాది పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. ప్రత్యేకంగా కోదాడ పట్నం మటన్ మార్కెట్‌లో 200 మంది, కౌసర్ మసీదు ఏరియాలో పేదలు, కృష్ణప్రియ థియేటర్‌లో 50 మంది, లక్ష్మీపురంలో 150 మంది, రఘునాధపాలెంలో 150 మంది, అశోక్ నగర్‌లో 50 మంది, చిలుకూరులో 150 మంది, హైదరాబాదులో 500 మంది పేదలకు సరుకులు అందించామని చెప్పారు.అవి మాత్రమే కాదు, నిత్యవసర సరుకులతో పాటు విద్య, వైద్యం, మంచినీరు వంటి కనీస సౌకర్యాలను కూడా అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో పేదలకు ఇళ్లు, ఉపాధి సహాయం మరియు మరిన్ని సౌకర్యాలను కల్పిస్తామని మౌలానా అహ్మద్ నద్వి చెప్పారు. "అల్లా దయతో ఈ సేవలను కొనసాగిస్తాము" అని ఆయన జోడించారు.సొసైటీలు రంజాన్ మొత్తం పేదలకు ఆహార, వస్త్రాలు, నిత్యావసరాలు అందిస్తూ, గ్రామీణ మరియు నగర పేద వర్గాలకు సేవలు అందించడంలో ముందంజలో ఉన్నాయి.

# ఐక్యతకు నిదర్శనం.. ముస్లిం మహిళలకు సహాయం...



**కోదాడ,మార్చి 21(నినాదం):** మునగాల మండలం నరసింహులగూడెం గ్రామంలో సామాజిక ఐక్యతను ప్రతిబింబించేలా ముస్లిం మహిళలకు చీరలు, సేమియాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. 11వ వార్డు మెంబర్ సోమపంగు రేణుక గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డులోని ముస్లిం మహిళలకు చీరలతో పాటు సేమియాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుంచం ఇందిర నరసయ్య మాట్లాడుతూ, గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కులమత భేదాలు లేకుండా అందరికీ సహాయం చేయడం గ్రామ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ ప్రజలు అందరూ కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం ముస్లిం మహిళలు వార్డు మెంబర్ రేణుకను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో మోసం: బిఆర్ఎస్ ఆరోపణలు



**చింతపల్లి, మార్చి 21 ( నినాదం) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా బడ్జెట్‌లో ప్రజలను మోసం చేశారని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ విమర్శించారు. శనివారం దేవరకొండ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం 'అభయహస్తం' మేనిఫెస్టోతో ప్రజలను నమ్మబలికి అధికారంలోకి వచ్చిందని, కానీ హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. బడ్జెట్‌లో ఎక్కడా ఆరు గ్యారంటీల ప్రస్తావన లేకుండా అంకెల గారడీ, మాటల గారడీతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన రూ. 2,500, రైతులకు రూ. 15,000 రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, భృతి వంటి హామీలు అమలు కాలేదన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లకు ఇవ్వాల్సిన ఆర్థిక సహాయం కూడా బాకీగా ఉందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర సంపదను దోచుకుంటూ ప్రజలను గాలికి వదిలేసిందని, మూడు బడ్జెట్లలో కూడా బలహీన వర్గాలకు తగిన నిధులు కేటాయించలేదని విమర్శించారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం కొద్ది ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్, నేనావత్ కిషన్ నాయక్, మండల అధ్యక్షుడు టి వి ఎన్. రెడ్డి, సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, నీల రవికుమార్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, కౌన్సిలర్లు విరమోని అంజి గౌడ్, కేతావత్ రుప్లా నాయక్, పొట్ట మురళి, పొట్ట మధు, బొడ్డుపల్లి కృష్ణ, ఇమ్రాన్, ముదిగొండ హరిదాస్, జైపాల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# అల్లాహ్ దీవెనలతో మానవాళికి సకల శుభాలు కలగాలి





- **చౌటుప్పల్ ఈద్గా చైర్మన్ మాజీ కౌన్సిలర్ బాబా షరీఫ్**

**మునుగోడు, మార్చి 21 (నినాదం):** అల్లాహ్ దీవెనలతో ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని, మునుగోడు నియోజకవర్గం. యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ ఈద్గా చైర్మన్, మాజీ చౌటుప్పల్ మున్సిపల్ కౌన్సిలర్ ఎండి బాబా షరీఫ్ అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం పురస్కరించుకొని చౌటుప్పల్ మండల కేంద్రంలోని, ఈద్గా వద్ద చైర్మన్ బాబా షరీఫ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా, చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఈద్గా చైర్మన్ బాబా షరీఫ్ మాట్లాడుతూ..నెలరోజుల కఠిన ఉపవాస దీక్షల అనంతరం జరుపుకునే రంజాన్ పండుగను ముస్లిం సోదరులు తమ కుటుంబ సభ్యులు బంధు మిత్రులతో సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈద్-ఉల్-ఫితర్ సందర్భంగా ముస్లిం సోదరులు అల్లా దీవెనలు నిండుగా అందుకోవాలని ఆకాంక్షించారు. అల్లాహ్ దీవెనలతో ప్రజలకు, ప్రపంచ మానవాళికి సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం సందర్భంగా నెలరోజుల కఠిన ఉపవాస దీక్షతో క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ, దయ, సోదర భావం ఐక్యతను పెంపొందిస్తాయి అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో, ముస్లింలు పాల్గొన్నారు.

# డొల్ల బడ్జెట్.. గోల్‌మాల్ బడ్జెట్

**అంకెల గారడితో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం**

**మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ డొల్ల బడ్జెట్, గోల్మాల్ బడ్జెట్ అని, అంకెల గారిడితో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారని రాష్ట్ర మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 3లక్షల కోట్లు అప్పుచేసి మూడు అంటే మూడు పథకాలు పూర్తి చేయలేని దుస్థితి రేవంత్ రెడ్డి ప్రభుత్వానిదని, ఇది తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని ఆయన విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 11డిక్లరేషన్లు అన్ని మోసమేనని,భారతదేశ చరిత్రలో ప్రజలను ఇంత దగాపురితంగా మోసం చేసే బడ్జెట్ నేను చూడలేదని దుయ్యబట్టారు. ఎన్నికల డిక్లరేషన్లో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క వాగ్దానం నిలుపుకోకుండా మహిళలను, వృద్ధులను, దివ్యాంగులను, విద్యార్థినులను, రైతులను, కార్మికులను, ఉపాధి కూలీలను, హరిజన, గిరిజన, బడుగు బలహీన, మైనార్టీ వర్గాలను మోసం చేసి చరిత్రలోకి ఎక్కిందని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ ఎంపిపి కృష్ణా నాయక్, గంధం పరంజ్యోతి, గోపాల్ పేట మండల అధ్యక్షులు బాలరాజు, పెబ్బేరు మండలం అధ్యక్షులు వనం రాములు, కర్రెస్వామి, నాయకులు ధర్మా నాయక్, దేవర్ల నరసింహ, నాగన్న యాదవ్, నారాయణ నాయక్, జోహెబ్ హుస్సేన్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, వడ్డే రమేష్, మంద రాము, శంకర్ తదితరులు ఉన్నారు.

# భౌతికకాయానికి నివాళులర్పించిన మాజీ మంత్రి



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** రేవల్లి మండల కేంద్రానికి చెందిన బాల్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం వారి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి మనో ధైర్యాన్ని ఇచ్చారు. మాజీ మంత్రి వెంట శ్రీనివాసపురం నరసింహ, శివరాం రెడ్డి, చిట్యాల రాము పాల్గొన్నారు.

# ఆర్థికసాయం అందజేసిన సర్పంచ్



**డోర్నకల్ /మరిపెడ, మార్చి 21 (నినాదం):** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం అజ్మీరా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ధరావత్ తండాలో భూక్యా అచ్చమ్మ మృతి చెందారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాల ఖర్చుకై 5000/- వేళ రూపాయల నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.వారితో పాటు గ్రామ ముఖ్య నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 21 (నినాదం):** వనపర్తి పట్టణంలోని 19వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్త జగదీష్ ప్రమాదవశాత్తు నల్ల చెరువులో పడి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కౌన్సిలర్ సూగూరు మురళి సాగర్ కుటుంబ సభ్యులకు రూ. 5000 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆయన దగ్గరుండి దహన సంస్కారాలు చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాకలి సత్యం, సూగురు రాజు సాగర్, నరసింహ, నరేందర్, రవి, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లింలు ఈదుల్ ఫిత్ర్ నమాజ్



**మిర్యాలగూడ మార్చి 21 (నినాదం):** మిర్యాలగూడ డివిజన్ లో రంజాన్ ఉపవాసాలు పూర్తి చేసుకుని ముస్లింలు ఈదుల్ ఫిత్ర్ నమాజ్ ను పట్టణంలోని బంగారుగడ్డ ఈద్గాహ్, మండలంలోని టీక్యతండా, అవంతిపురం ఈద్గాహ్ ల వద్ద వేలాది మంది ముస్లింలు శనివారం నిర్వహించారు. బంగారుగడ్డ ఈద్గాహ్ లో మౌలానా వలియుల్లా, టీక్య తండాలో మౌలానా మగ్దుం అక్బర్ మోహియుద్దీన్, అవంతిపురంలో ముఫ్తి ఇమ్రాన్ నమాజ్ చేయించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా డిఎస్పి కె. రాజశేఖర్ రాజు పర్యవేక్షణలో ఒన్, టూ టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు నాగభూషణరావు, సోమనరసయ్య, ప్రసాద్ బందోబస్తు నిర్వహించారు. ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

# నల్గొండ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా

## బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుతో ప్రతి ఎకరానికి సాగునీరు... రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**నల్లగొండ ప్రతినిధి మార్చి 21( నినాదం):**

బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా నల్లగొండ నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు శనివారం నల్లగొండ మండలం అప్పాజీపేట గ్రామంలో ద్విచక్ర వాహనం నడుపుతూ బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుంచి వచ్చే సాగునీటి కాలువలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా కొండపాక గూడెం నుంచి అప్పాజీపేట వరకు నూతనంగా ఏర్పాటు చేసే పిల్ల కాలువ నిర్మాణ పనులకు అప్పాజీపేటలో శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రాహ్మణవల్ల ప్రాజెక్టు నియోజకవర్గ ప్రజలకు వరం లాంటిదని, ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే కాలువ నీటి ద్వారా రైతులందరిలో



సంతోషం వెల్లువిరుస్తుందని తెలిపారుబ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు తో భూగర్భజాలాలు పెరగడంతో పాటు కాలుల ద్వారా గ్రామంలో ప్రతి చెరువును నింపడం జరుగుతుందని పేర్కొన్నారురైతు సంక్షేమం కోసం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, ఆర్డీవో అశోక్ రెడ్డి, స్థానిక సర్పంచ్ గంగుల అండాలు సైదులు,ఇరిగేషన్ ఈఈ సతీష్ చంద్ర,డిఈ పిచ్చయ్య, ఏఈ నవీన్ కుమార్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బురి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్, మాజీ జడ్పిటిసిలు పాశం, రామ్ రెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,అప్పాజీపేట మాజీ సర్పంచ్ గంగుల సైదులు, ఉప సర్పంచ్ పోలే సతీష్,రాపర్తి



సతీష్,అయితగోని శేఖర్, కట్ట అంజయ్య ,కాసర్ల బిక్షపతి, గంగుల నరేందర్, నందిపాటి అశోక్ ,ఐత రాజు గణేష్, కాసర్ల సురేందర్ రెడ్డి,జాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు



# ఆత్మకూరును అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతా

## క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**అమరచింత, మార్చి 21, (నినాదం):**



ఆత్మకూరును అభివృద్ధి చేసి తీరుతానని రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. మహిళ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు.పేదోడు ఆడ పిల్లల పెళ్లి చేయాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉందని తెలిపారు. తీసుకున్న అప్పును సరైన సమయంలో తీర్చాలంటే కళ్యాణ లక్ష్మి చెక్కులను సరైన సమయంలో ఇవ్వాల్సిన అవశ్యకత ఉందని తెలిపారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేకున్నా ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రతీ పేదవాడికి నెలకు 6 కిలోల సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా ఇస్తున్నామని గుర్తు చేశారు. ఆత్మకూరు లో ఇప్పటికే అర్హులైన పేదవారికి రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని,ఇంకా 1500 ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఆత్మకూరు రూపు రేఖలు మారుస్తానన్నారు మంత్రి. ఆరు నూరైనా ఆత్మకూరును అభివృద్ధి చేసి తీరుతానన్నారు.జూరాల వద్ద బ్రిడ్జి ని పూర్తి చేస్తే ఆత్మకూరుకు మహర్దష పడుతుందన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి అడ్డుపడకండని ప్రతిపక్షాలకు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో మంత్రి తో పాటు ఆత్మకూరు పట్టణ మున్సిపల్ ఛైర్ పర్సన్ నాగమణి, వైస్ ఛైర్ పర్సన్ నల్లగొండ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.



# సీఎం సహాయనిధి నిరుపేదలకు భరోసా

## శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్

**కల్వకుర్తి, మార్చి 21 (నినాదం):**

సీఎం సహాయనిధి నిరుపేదలకు భరోసనిస్తుందని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ అన్నారు. శనివారం కల్వకుర్తి మండల తర్నికల్ గ్రామానికి చెందిన గొడుగు కృష్ణయ్య కు 54 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ ముదిరాజ్ బాధిత కుటుంబ సభ్యునికి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసానిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ గొడుగు బాల్ చందర్, గొడుగు ఆదర్శ్, గొడుగు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు ఇళ్లు, రుణాలు..

# ఉపాధికి ప్రత్యేక చర్యలు





## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ధర్మపురి మార్చి 21 (నినాదం)**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం జగిత్యాల జిల్లా ధర్మపురి కేంద్రంలో మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో సెక్యులర్ విలువలను కాపాడటానికి కాంగ్రెస్ పార్టీకి మైనార్టీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని దేశ ప్రధాని



చేయడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మైనార్టీల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేద ముస్లింలకు ప్రభుత్వం ద్వారా అందించే రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తామని వెల్లడించారు. అర్హులైన పేద ముస్లింలకు ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి తెలిపారు. మసీదులు, ఈద్గాల వద్ద మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయించి సౌకర్యాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్ ఇందారపు రామన్న, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



# కొండగట్టులో కేంద్ర మంత్రి బండి సంజయ్ పూజలు

**మల్యాల, మార్చి 21( నినాదం):**



జగిత్యాల జిల్లా మల్యాల మండలం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానం కొండగట్టులో శనివారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ స్వామి వారిని దర్శించుకున్నారు .ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాలతో సత్కరించి స్వామివారి ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈనెల 14న అంజన్న ఆశీర్వాద పాదయాత్ర కరీంనగర్ నుండి కొండగట్టుకు చేపట్టగా రాత్రి వరకు కొండకు చేరుకోగా ఆలయం తలుపులు మూసివేశారు. మరో మారు ఈ సందర్భం పురస్కరించుకొని స్వామివారికి మంత్రి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ మేయర్ కొలగానిశ్రీనివాస్, బోయిన్పల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు బింగి వేణు, మద్దుట్ల సర్పంచ్ సంకుర్తి తిరుపతి. సీనియర్ నాయకులు బొట్ల ప్రసాద్, బొబ్బిలి వెంకటస్వామి, కొల్లూరి గంగాధర్, పొన్నగంటి రమేష్, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎఎ23పై భారీ అంచనాలు

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ లీడ్ రోల్‌లో, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ ప్రాజెక్ట 'ఎఎ23'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. అధికారిక ప్రకటన వచ్చినప్పటి నుంచే ఈ సినిమా ఇండియన్ సినీవర్గాల్లో హాట్ టాపికగామారింది. ఈ ప్రాజెక్టకు మ్యూజిక సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించనుండగా, సంక్రాంతి సందర్భంగా విడుదల చేసిన స్పెషల్ వీడియోతో సినిమాపై హైప్ మరింత పెరిగింది. భారీ



బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. బన్నీ వాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇక ఈ సినిమా క్యాస్టింగ్ విషయంలో ప్రస్తుతం పలు ఆసక్తికర వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే బాలీవుడ్ హీరోయిన్ శ్రద్ధా కపూర్ పేరు ఫైనల్ అయిందని ప్రచారం జరుగుతుండగా, తాజాగా మరో స్టార్ హీరోయిన్ పేరు తెరపైకి వచ్చింది. బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా ఈ ప్రాజెక్టలో కీలక పాత్రలో కనిపించే అవకాశాలు ఉన్నట్లు టాక వినిపిస్తోంది. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో ఈ వార్తలు పుకార్లుగానే ఉన్నప్పటికీ, అభిమానుల్లో మాత్రం ఆసక్తి పెరుగుతోంది. ఒకవేళ ఈ కాంబినేషన్ నిజమైతే, ఇది పాన్ ఇండియా స్థాయిలో మరింత క్రేజ్ తెచ్చే ప్రాజెక్ట అవుతుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

# నితిన్ మళ్లీ గాడిలో పడేనా

టాలీవుడ్ హీరో నితిన్ ఒకప్పుడు వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న ఆయన, గత కొన్నేళ్లుగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయారు. 'చెక్', 'రంగ్ దే', 'మ్యాస్ట్రో', 'మాచర్ల నియోజకవర్గం', 'ఎక్స్ ట్రా ఆర్డినరీ మ్యాన్' వంటి చిత్రాలు ప్రేక్షకులను నిరాశపరచగా, గతేడాది విడుదలైన 'తమ్ముడు', 'రాబిన్‌హుడ్' సినిమాలు కూడా డిజాస్టర్లుగా మారి ఆయన మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ పరిస్థితుల్లో రూట్ మార్చిన నితిన్, కథల ఎంపికలో జాగ్రత్తలు తీసుకుంటూ సక్సెస్ ట్రాక్‌లోకి తిరిగి రావడానికి ప్లాన్ చేస్తున్నారు.



ప్రస్తుతం ఆయన టాలెంటెడ్ డైరెక్టర్ విఐ ఆనంద్ దర్శకత్వంలో ఒక భారీ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నటిస్తున్నారు. విభిన్న కాన్సెప్ట్‌లతో సినిమాలు తెరకెక్కించే ఆనంద్, నితిన్ కోసం ఒక కొత్త తరహా కథను సిద్ధం చేయడంతో ఈ ప్రాజెక్టపై మంచి ఆసక్తి నెలకొంది. ఇంతలోనే నితిన్ మరో రెండు క్రేజీ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరిచారు. అందులో ఒకటి 'ఆరు' సినిమాతో బ్లాకబేస్టర్ అందుకున్న దర్శకుడు అంజి చెప్పిన కథ. ఈ చిత్రాన్ని నితిన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రేష్ట్ మూవీస్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. జూలై నుంచి షఉటింగ్ ప్రారంభించి, వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇదే కాకుండా, మరో ప్రముఖ నిర్మాణ సంస్థలో ఒక కొత్త దర్శకుడితో సినిమా చేయడానికి కూడా నితిన్ సిద్ధమవుతున్నారని సమాచారం. ఈ ప్రాజెక్టకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే నెలలో వెలువడే అవకాశం ఉంది.రెగ్యులర్ కమర్షియల్ ఫార్మాట్‌కు భిన్నంగా, కొత్త తరహా కథలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు.



NINADAM CINEMA

# దురంధర్-2

## అద్భుతం: రాజమౌళి



రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో దర్శకుడు ఆదిత్య ధార్ తెరకెక్కించిన 'ధురంధర్ 2: ద రివెంజ్' చిత్రంపై టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసల వర్షం కురిపించారు. తాజాగా ఈ సినిమా చూసిన జక్కన్న ఎక్స వేదికగా పోస్ట్ పెట్టాడు. నాలుగు గంటల సినిమా



తీయాలంటే దమ్ముండాలని పేర్కొన్నారు. ఈ చిత్రం మొదటి భాగం కంటే స్కేల్ మరియు ఎమోషన్ పరంగా అద్భుతంగా ఉందని, తనకు 'ధురంధర్ 1' అంటే చాలా ఇష్టమని కానీ సీక్వెల్ దానిని మించిపోయిందని ఆయన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ముఖ్యంగా 4 గంటల సుదీర్ఘ నిడివి ఉన్నప్పటికీ, ప్రేక్షకులను సీటు నుంచి కదలకుండా చేయడంలో దర్శకుడు ఆదిత్య ధార్ విజయం సాధించారని, ఇది ఒక గొప్ప సాహసమని రాజమౌళి కొనియాడారు. రణవీర్ సింగ్ నటనను ప్రస్తావిస్తూ, షెడ్ లో చెల్లెలితో వచ్చే సన్నివేశం ఒక 'మాస్టర్‌క్లాస్ ఇన్ యాక్టింగ్' అని, హమ్జా మరియు జస్కీరత్ పాత్రల్లో ఆయన మెస్మరైజ్ చేశారని అభినందించారు. అలాగే ఆర్. మాధవన్ దేశం నిస్సహాయతను తన నటనతో అద్భుతంగా పండించారని రాజమౌళి ప్రశంసించారు.సినిమాలోని రైటింగ్, మ్యూజిక, వరల్డ్ డిజైన్ వంటి సాంకేతిక అంశాలు కూడా అద్భుతంగా కుదిరాయని ఆయన వెల్లడించారు. మరోవైపు ఈ భారీ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద కూడా సునామీ సృష్టిస్తోంది, కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.350 కోట్లకు పైగా వసూళ్లు సాధించి రికార్డులు తిరగరాస్తోంది.



# పెళ్లిపీటలెక్కిన పునర్నవి

తెలుగు సినీ ప్రేక్షకులకు సుపరిచితమైన నటి పునర్నవి భూపాలం తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టింది. 'ఉయ్యాల జంపాల' సినిమాతో తెలుగు తెరపై అడుగుపెట్టిన ఈ భామ, తన అమాయకత్వం, సహజమైన నటనతో మొదటి చిత్రంతోనే మంచి గుర్తింపు సంపాదించింది. పల్లెటూరి అమ్మాయిగా కనిపించిన ఆమె పాత్ర ప్రేక్షకులను ఆకట్టుకుని, ఆమెను ఇండస్ట్రీకి పరిచయం చేసింది. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాల్లో నటించినప్పటికీ, ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో కొంతకాలం సినిమాలకు దూరమైంది. ఈ సమయంలోనే బుల్లితెరపై 'బిగ్ బాస్ తెలుగు'లో పాల్గొని మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ఈ కార్యక్రమం ద్వారా ఆమెకు మంచి గుర్తింపు లభించడంతో పాటు అభిమాన వర్గం కూడా పెరిగింది. నిజానికి సినిమాల కంటే ఈ కార్యక్రమం ద్వారానే ఆమెకు ఎక్కువ ప్రాచుర్యం లభించింది. అయితే, వచ్చిన అవకాశాలను పక్కనపెట్టి విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు నిర్ణయించుకుంది పునర్నవి. లండన్‌లో చదువులు కొనసాగిస్తూ, పూర్తిగా తన విద్యపై దృష్టి పెట్టింది. అయినప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి అభిమానులతో తన అనుభవాలను పంచుకుంటూ ఉండేది. ఇటీవల డిసెంబర్ నెలలో తాను ప్రేమించిన వ్యక్తితో నిశ్చితార్థం జరిగినట్లు ప్రకటించి అందరికీ సర్ ప్రైజ్ ఇచ్చింది. ఈ వార్తతో ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. మార్చి 20న ఆమె తన ప్రియుడు హేమంత్ వర్మను వివాహం చేసుకుంది. హేమంత్ వర్మ ప్రముఖ ఫోటోగ్రాఫర్‌గా గుర్తింపు పొందిన వ్యక్తి. వీరిద్దరూ చాలా కాలంగా ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వివాహ వేడుకను చాలా సింపుల్‌గా, కుటుంబ సభ్యులు మరియు సన్నిహితుల మధ్య నిర్వహించారు.

# హీరోయిన్‌గా నిహారిక రీ ఎంట్రీ

నాగబాబు ముద్దుల కూతురిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టిన నిహారిక 'ఒక మనసు' చిత్రంతో వెండితెరకు పరిచయం అయింది. ఆ తర్వాత పలు చిత్రాల్లో హీరోయిన్‌గా నటించినప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు రాకపోవడంతో నిర్మాతగా కెరీర్‌ను ప్రారంభించింది. అందులో భాగంగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించి సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' వెబ్ సిరీస్‌ను నిర్మించింది. ఈ వెబ్ సిరీస్‌కు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించింది. ఆ తర్వాత 'కమిటీ కుర్రాళ్ళు' అనే యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌ను నిర్మించగా, అది థియేటర్లలో విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. తాజాగా నిహారిక 'రాకాస' చిత్రాన్ని నిర్మించింది. ఇందులో సంగీత శోభన్ ప్రధాన పాత్రలో నటించాడు. ఈ మూవీని ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం మూవీ యూనిట్ పెద్ద ఎత్తున ప్రమోషన్ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ... ఇప్పటికే సంగీత్ శోభన్‌తో 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ' వెబ్ సిరీస్ నిర్మించానని, ఇప్పుడు ఆయనతో 'రాకాస' మూవీ చేశానని తెలిపింది. ఈ చిత్రం హర్రర్ కామెడీ ప్లస్ ఫాంటసీ జానర్‌లో రూపొందిందని, ప్రేక్షకులను ఖచ్చితంగా అలరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేసింది. అలాగే ఈ మధ్యకాలంలో కుటుంబంతో కలిసి చూసే విధంగా సినిమాలు తక్కువగా వస్తున్నాయని, అయితే ఈ చిత్రాన్ని మాత్రం ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా రూపొందించామని చెప్పుకొచ్చింది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787